జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 15 సంచిక 345 విశాఖపట్నం | శనివారం 12 ఆగష్టు 2023 | 8 పేజీలు | వెల : 5.00



కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.

ప్రతి వాలంటీర్ కు

నెలకు Rs.25,000/-

Salary ఇవ్వబడును.

విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.

ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా

మీ ప్రాంతంలో ఉన్న పార్టీ లీడర్స్ ని సంప్రదించవచ్చు.

లేదా ఈ క్రింది నెంబర్

7660027683 కి వాట్సాప్ చేయగలరు.


## మూక దాడికి పాల్పడినా...

# మైనర్‌పై అత్యాచారం చేసినా ఇక మరణశిక్షే..

## నేర చట్టాల్లో కేంద్రం సంచలన మార్పులు



న్యూ ఢిల్లీ: బ్రిటీష్ కాలం నాటి భారతీయ నేర చట్టాల్లో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. భారత శిక్షా స్మృతి (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత--2023, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత--2023, ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ) స్థానంలో భారతీ సాక్ష్య --2023ను తీసుకురానుంది. శుక్రవారం ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి ఈ బిల్లులను పంపిస్తామని చెప్పారు.


“దేశద్రోహ చట్టం రద్దు అయింది. దేశద్రోహం అనే పదం ప్రతిపాదిత చట్టంలో లేదు. భారతదేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు హాని కలిగించే చర్యలపై శిక్షించేందుకు సంబంధించి సెక్షన్ 150ని తీసుకొచ్చాం” అని అమిత్ షా చెప్పారు.

“ఎవరైనా సరే.. ఉద్దేశపూర్వకంగా మాటల ద్వారా కానీ, రాతల ద్వారా కానీ, ప్రత్యక్షంగా కానీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా కానీ, ఆర్థిక మార్గాలను ఉపయోగించడం ద్వారా కానీ, ఇంకే విధంగానైనా సరే.. వేర్పాటువాద చర్యలు లేదా సాయుధ తిరుగుబాటు చర్యలు లేదా విధ్వంసక కార్యకలాపాలను ప్రోత్సహించడం, భారతదేశ సార్వభౌమాధికారం లేదా ఐక్యత, సమగ్రతను ప్రమాదంలో పడేసే చర్యలకు దిగితే.. జీవిత ఖైదు, లేదా ఏడేళ్ల జైలు శిక్ష, దాంతోపాటు జరిమానా కూడా విధిస్తారు” అని సెక్షన్ 150లో పేర్కొన్నారు.

మూక దాడి (మాబ్ లించింగ్) కేసుల్లో నేరస్థులుగా తేలితే ఉరి శిక్ష విధించాలనే నిబంధనను కూడా కేంద్రం ప్రవేశపెడుతుందని షా చెప్పారు. ఇదే సమయంలో సామూహిక అత్యాచారానికి పాల్పడితే.. 20 ఏళ్ల జైలు నుంచి జీవిత ఖైదు దాకా, మైనర్‌పై అత్యాచారం చేస్తే ఉరిశిక్ష విధించేలా నిబంధనలను పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

“ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాన్ని రద్దు చేస్తాం. అవి బ్రిటీష్ కాలం నాటివి. బ్రిటీషర్ల పాలనను రక్షించుకునేందుకు, బలోపేతం చేసుకునేందుకు ఉద్దేశించినవి. వాటి స్థానంలో తీసుకొచ్చే కొత్త చట్టాలు.. భారత పౌరుల హక్కులను పరిరక్షిస్తాయి” అని అమిత్ షా వివరించారు. “శిక్షలు వేయడం కాదు.. న్యాయం అందించడం కొత్త చట్టాల లక్ష్యం. నేరాలను అరికట్టాలనే ఉద్దేశంతోనే శిక్షలు విధిస్తారు'' అని చెప్పుకొచ్చారు.

# ‘వైఎస్సార్ సున్నా వడ్డీ’ నగదు జమ



అమరావతి: వరుసగా నాలుగో ఏడాదీ వైఎస్సార్ సున్నా వడ్డీ (మహిళలు) పథకం అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుడుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అర్హత గల 9.48 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 1,05,13,365 మంది అక్కచెల్లెమ్మలు బ్యాంకులకు చెల్లించిన రూ.1,353.76 కోట్ల వడ్డీని రీయింబర్స్ చేస్తూ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి నేరుగా నగదు జమ చేస్తారు. ఈ రూ.1,353.76 కోట్లతో కలిపి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఇప్పటివరకు అందించిన మొత్తం సాయం రూ.4,969.05 కోట్లు అవుతుంది. పేద అక్కచెల్లెమ్మలకు సాధికారత కల్పిస్తూ.. వారు చేస్తున్న వ్యాపారాలకు ఊతమిచ్చేలా సున్నా వడ్డీకే రుణాలు అందించి, వారి జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరుస్తున్న సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద వడ్డీ భారం పడకుండా వారి తరపున ఆ భారాన్నీ వైఎస్సార్ సున్నా వడ్డీ కింద నేరుగా పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.

అక్కచెల్లెమ్మలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా.. వారి జీవనోపాధి మెరుగుపడేలా బహుళజాతి దిగ్గజ కంపెనీలు, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుని వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలతో సుస్థిర ఆర్థికాభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం బాటలు వేసింది.

ప్రభుత్వం చొరవ తీసుకుని బ్యాంకులతో మాట్లాడి వడ్డీరేట్లు తగ్గింపచేయడంతో అక్కచెల్లెమ్మలపై రూ.1,224 కోట్ల మేర వడ్డీ భారం తగ్గింది. దీంతో ఏటా రూ.30 వేల కోట్లకు పైగా రుణాలు అందుకుని.. వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటూ.. రుణాల రికవరీలో సైతం 99.67 శాతంతో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచి అక్కచెల్లెమ్మలు ఆర్థిక పరిపుష్టిని సాధించారు.

ప్రభుత్వ సహకారంతో పశువుల కొనుగోలు, కిరాణా దుకాణాలు, వస్త్ర వ్యాపారాల వంటివి చేసుకుంటున్న 16,44,029 మంది అక్కచెల్లెమ్మలకు నెలకు రూ.7,000 నుంచి రూ.10,000ల వరకు అదనపు ఆదాయం. అమూల్‌తో ఒప్పందం కారణంగా మార్కెట్‌లో పోటీ పెరిగి లీటర్ పాలపై రూ.20 వరకు అదనపు ఆదాయం కూడా లభిస్తోంది.

# రుషికొండకు బయల్దేరిన పవన్..

## పలు ఆంక్షలు విధించిన పోలీసులు



విశాఖపట్నం: విశాఖ లోని రుషికొండ పరిశీలనకు వెళ్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. జోడుగుళ్లపాలెం నుంచి ఎవరినీ అనుమతించబోమని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ర్యాడిసన్ బ్లూ హోటల్ నుంచి కేవలం పవన్ వాహనానికి మాత్రమే అనుమతి ఉందని చెప్పారు. రుషికొండకు ఎదురుగా ఉన్న రోడ్డులోనే పవన్ వెళ్లాలని, కొండపైకి వెళ్లకూడదని కండిషన్ పెట్టారు. కావాలనుకుంటే గీతం యూనివర్శిటీ వద్ద మీడియాతో మాట్లాడవచ్చని చెప్పారు. మరోవైపు వారాహి యాత్రలో భాగంగా నిన్న చేసిన వ్యాఖ్యలకు గాను పవన్ కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించారని, అలా వ్యవహరించకుండా ఉండాల్సిందని అన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, విద్వేషాలు రగిల్చే వ్యాఖ్యలు చేయరాదని, పోలీసుల నిబంధనలు పాటించాలని, షెడ్యూల్ వివరాలను ముందే ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

# హైదరాబాద్ మెట్రో బంపరాఫర్..

## ఆ మూడు రోజులు రూ. 59కే అన్‌లిమిటెడ్ జర్నీ

హైదరాబాద్ : భారత స్వాతంత్ర్య దినోత్సవం వేళ హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు బంపరాఫర్ ప్రకటించింది.



సూపర్ సేవర్ ఫ్రీడం ఆఫర్ పేరుతో కొత్త పాస్‌ను మెట్రో ప్రయాణికులకు పరిచయం చేసింది. కేవలం రూ. 59 చెల్లించి.. ఈ నెల 12, 13, 15 తేదీల్లో నగరంలో ఎన్నిసార్లు అయినా ప్రయాణించొచ్చు అని హైదరాబాద్ మెట్రో వెల్లడించింది. ఈ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఈ సందర్భంగా ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని సూపర్ సేవర్ ఫ్రీడం ఆఫర్ ప్రకటించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ ఆఫర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, మెట్రోను ఆదరించాలని ఆయన కోరారు.

# ఐపిసి, సిఆర్‌పిసి చట్టాల స్థానంలో మూడు కొత్త చట్టాలు ..



న్యూఢిల్లీ బ్యూరో :మోడీ ప్రభుత్వం మూడు వివాదాస్పద కొత్త క్రిమినల్ బిల్లులను శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. నేర న్యాయ వ్యవస్థను సంస్కరించే క్రమంలో మూడు కొత్త బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన మోదీ ప్రభుత్వం దేశద్రోహ చట్టాన్ని రద్దు చేయాలని నిర్ణయించిందని కేంద్ర హౌంమంత్రి అమిత్ షా శుక్రవారం (ఆగస్టు 11) పార్లమెంటులో ప్రకటించారు. వాస్తవానికి పేరులో రాజద్రోహం అన్న పదాన్ని తొలగించారే తప్ప అందులోని నిబంధనలకు మరిన్ని కోరలు తొడిగి మరింత క్రూరంగా మార్చారు. రాజద్రోహంపై అనేక విమర్శలు వచ్చినందున ఆ పేరును తొలగించినట్లుగా ఉంది.మూడు కొత్త బిల్లుల్లో భారతీయ శిక్షాస్మఅత్షి,1860 స్థానే భారతీయ న్యాయ సంహిత బిల్లు2023, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్1898 స్థానే భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు 2023 , ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 స్థానే భారతీయ సాక్ష్యాధారాల బిల్లు, 2023 ను తీసుకొచ్చారు.''ఈ బ్రిటీష్ చట్టాలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని బలోపేతం చేయడానికి మరియు రక్షించడానికి రూపొందించబడ్డాయి వాటి లక్ష్యం శిక్షించడం న్యాయం చేయడం కాదు.

మేము తీసుకువస్తున్న మూడు కొత్త చట్టాల స్ఫూర్తి శిక్షించడమే కాకుండా ప్రతి పౌరుడికి న్యాయం చేయడంతోపాటు మరిన్ని నేరాలు జరగకుండా ఉండేందుకు ఉద్దేశించినది” అని కేంద్ర హౌం మంత్రి సెలవిచ్చారు.మూడు కొత్త బిల్లులను క్లుప్తంగా ప్రవేశపెట్టిన అమిత్‌షా, వాటిని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపుతామని, ఆ తర్వాత పార్లమెంటుకు అందజేస్తామని చెప్పారు.ప్రతిపాదిత చట్టంలో మూక దాడులు, పెళ్లి చేసుకోవడం లేదా మోసం చేయడ ద్వారా స్త్రీతో లైంగిక సంబంధాలు కలిగి ఉండటం వంటి వాటిని నేరంగా పరిగణించడం ద్వారా ముఖ్యమైన మార్పులను తీసుకొచ్చింది. ఇది లైంగిక నేరాల బాధితుల వాంగ్మూలాలను తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయడానికి, ఛార్జిషీట్‌లను దాఖలు చేయడానికి , విచారణలను పూర్తి చేయడానికి కాల పరిమితులను విధించడం, అలాగే పరారీలో ఉన్న నేరస్థుల కోసం విచారణ నిర్వహించడం వంటి వాటిని కూడా అందిస్తుంది.


ఆంధ్రా & తెలంగాణ రాష్ట్రాల పరిధిలో ఉన్న మండలాలలో పొలిటికల్ లీడర్స్, ప్రామినెంట్ లీడర్స్ మరియు ఎన్జీవోస్‌ల నుండి ప్రస్తుత రాజకీయ పరిస్థితుల మీద ఒక 3 నిమిషాల నిడివిగల బైట్ తీసుకుని పంపించగల సత్తాఉండి, స్వంత ద్విచక్ర వాహనం, హెచ్.డి. క్వాలిటీ ఉన్న స్మార్ట్ ఫోన్ కలిగిన అభ్యర్థులు కావలెను.

వేతనం : 15,000/- P.M. + TA DA Actual

Forward applications through WhatsApp to the following no

AP Contact

9441503772, 9000621111

TS Contact

9154958315,8886022523

మాస్టర్ కీ TV ఛానల్

Sneha TV NEWS IS RIGHT

# జనసేన అధ్యక్షుడిపై ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫైర్



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. వాంబేకాలనీలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవీయ కోణంలో ప్రతి ఒక్కరికీ మేలు చేకూర్చేలా పనిచేస్తోన్న సీఎం జగన్ ను జనసేన అధినేత వీరప్పన్ తో పోల్చడాన్ని మల్లాది విష్ణు తీవ్రంగా తప్పుబట్టారు. పొద్దున లెగిస్తే ఎల్లో మీడియాలో కనిపించడం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చేస్తున్న దిగజారుడు రాజకీయాలు వెగటు పుట్టిస్తున్నాయన్నారు. మరీముఖ్యంగా జనసేన అధినేత రాష్ట్ర ప్రభుత్వం గూర్చి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శాసనసభలో నామమాత్రంగా ప్రాతినిధ్యం ఉన్న తెలుగుదేశం, అసలు ప్రాతినిధ్యమే లేని జనసేన కలిసి చేస్తున్న కుట్ర రాజకీయాలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని మల్లాది విష్ణు అన్నారు. హైదరాబాద్ ను మించిన పాలన రాజధాని విశాఖలో సిద్ధమవుతుంటే ప్రతిపక్షాలు ఎందుకు ఓర్చుకోలేకపోతున్నాయని ప్రశ్నించారు. తమను ఓడించిన ప్రజలపై కక్ష సాధిస్తూ వారిలో విషపు బీజాలు నాటేలా ఉత్తరాంధ్రలో చంద్రబాబు, పవన్ పర్యటనలు సాగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను దేశంలోని అన్ని రాష్ట్రాలు కీర్తిస్తుంటే మన రాష్ట్రంలోని ప్రతిపక్షాలు మాత్రం కళ్లున్న కబోదుల్లా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ చంద్రబాబు, పవన్ లలో అభద్రతాభావం పెరిగిపోయి పిచ్చిపట్టిన వారిలా ప్రవర్తిస్తున్నారన్నారు. రాష్ట్ర విభజనకు ప్రధాన కారణం చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతమైతే సీఎం జగన్ గూర్చి పవన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అయినా వచ్చి అబద్ధాలను మాట్లాడుతూ ప్రజలలో తప్పుడు సంకేతాలు పంపుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు, పవన్ లకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే సింహాద్రి అప్పన్నపై ప్రమాణం చేసి ఉత్తరాంధ్రలో పర్యటించాలన్నారు. కేవలం నాలుగేళ్ల కాలంలోనే పేదరికంపై ఈ ప్రభుత్వం విజయం సాధించడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని మల్లాది విష్ణు అన్నారు.

తెలుగుదేశం హయాంలో చెత్త తరలించే వాహనాలలో దేవతామూర్తుల విగ్రహాలను తీసుకెళ్లిన దారుణ సంఘటనలు జరిగినప్పుడు జనసేన అధినేత ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కానీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయాల వ్యవస్థను పరిరక్షిస్తూ ముందుకు వెళుతున్నారని మల్లాది విష్ణు అన్నారు. ఈ ప్రభుత్వంలో దేవాలయాలన్నీ ధూపదీప నైవేద్యాలతో, నిత్య కైంకర్యాలతో కళకళలాడుతున్నాయన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రజలు పట్టం కట్టంబోతున్నారని మల్లాది విష్ణు తెలిపారు.

## అలరించిన సెయింట్ ఆన్స్ కాలేజ్ ఐ.ఒ.టి.టెక్నికల్ ప్రాజెక్ట్స్ ఎక్స్ పో

### - తక్కువ ఖర్చుతో అందుబాటులోకి ఆధునిక సాంకేతికత
### - పేదలకు అందుబాటులో సాంకేతిక ఆవిష్కరణలు

చీరాల, ఆగష్టు 11, ప్రజాపాలన : తక్కువ ఖర్చుతో, పేద ప్రజలకు సాంకేతిక ఆవిష్కరణలను, అందుబాటులో తెచ్చేందుకు, చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ఐ.ఓ.టి.విభాగ విద్యార్థులు, తయారు చేసిన ప్రాజెక్టులు వీక్షకులను విశేషంగా అలరించి, ఆలోచింపజేశాయి.

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఒ.టి) విభాగం వారి ఆధ్వర్యంలో, టెక్నికల్ ఎక్స్పో నిర్వహించినట్లు, కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, కళాశాల ప్రధానోధ్యాపకులు డాక్టర్. మొయిద వేణు గోపాలరావు లు సంయుక్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు సామాజిక అవగాహనతో ఆధునిక సాంకేతికతను, అందుబాటు లోకి తేవటం అభినందించతగ్గ విషయమన్నారు. తక్కు వ ఖర్చుతో సాంకేతిక ఆవిష్క రణలను, సామాన్య ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చే ఉద్దేశ్యంతో, ఈ ప్రాజెక్టులను ఐ.ఒ.టి విభాగ విద్యార్థులు రూపొందించినట్లు, ఐ.ఒ.టి విభాగాధిపతి డాక్టర్.యస్. ఇంద్రనీల్ తెలిపారు. ఈ టెక్ని కల్ ఎక్స్పో నందు ఐ.ఒ.టి విభాగ విద్యార్థులు రూపొందించిన వివిధ రకాలైన 20 ప్రాజెక్టు లను ప్రదర్శించారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్ పో నందు, ప్లాట్ ఫామ్ యాక్సిడెంట్ ప్రివెన్షన్ సిస్టమ్, స్మార్ట్ గేట్ యూజింగ్ ఆర్.యఫ్.ఐ.డి, వాయిస్ కంట్రోల్డ్ హౌస్ ఆటోమేషన్, తదితర 20 ప్రా జెక్టులను, విద్యార్థులు రూపొం దించినట్లు తెలిపారు. ఈ ఎక్స్ పో నందు, కళాశాలలోని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని, ఆసక్తిగా తిలకించి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



ప్రాజెక్టులను వీక్షిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాలరావు

## రామకృష్ణ సామాజిక సేవా దృక్పథం స్ఫూర్తిదాయకం

చీరాల, ఆగష్టు 11, ప్రజాపాలన : ప్రజా ప్రతినిధిగా,సీనియర్ రొటేరియన్ గా, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధిగా లెక్కలేనన్ని, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి, ఎందరికో ఆదర్శంగా నిలిచిన, పోలుదాసు రామకృష్ణ సామాజిక సేవాదృక్పథం స్ఫూర్తిదాయకమని, పలు వురు వక్తలు, ప్రముఖులు ప్రశంసించారు. పోలుదాసు రామకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించా రు. చీరాల ఎన్.ఆర్ అండ్ వి.ఎం.చీరాల హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నిరంతరం కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా, వాకర్స్ సెక్రెటరీ పోలుదాసు రామకృష్ణ జన్మదినోత్సవ వేడు కలలో భాగంగా, రామకృష్ణ ఆర్థిక సహకారంతో, కోటయ్య అనాధ వృద్ధాశ్రమానికి 25 కిలోల బియ్యం, బిస్కెట్ ప్యాకెట్లు, చైతన్య మనో వికాస పునరావాస కేంద్రానికి, 25 కిలోల బియ్యం, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, సామాజిక సేవ గుణానికి ప్రతిరూపం పోలుదాసు.రామకృష్ణ యే అనటంలో అతిశయోక్తి లేదన్నారు. తన వద్ద లేకపోయినా, పదిమందికి చెప్పి, వారి ద్వారా సహాయం చేయించే మంచి గుణం, కేవలం ఆయనకే సొంత మన్నారు. పట్టణ ప్రముఖులు డా.వి.అమృతపాణి, వలివేటి మురళీకృష్ణ లు మాట్లాడుతూ, కౌన్సిలర్ గా 15 వార్డు ప్రజలకు సేవ చేయటమే కాకుండా, రోటరీ, వాకర్స్ అసోసియేషన్ కి కూడా, ఎనలేని విశేష సేవలు అందిస్తున్నారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్య క్షులు అమరా వీరాంజనేయు లు, సెక్రటరీ పోలుదాసు రామ కృష్ణ, పట్టణ ప్రముఖులు డా. వరికూటి.అమృతపాణి, వలి వేటి మురళీకృష్ణ, గుర్రం బదరీ, సుభాషిణి, శీరాం రమేష్, చారుగుళ్ల ప్రసాద్, చింతా రమేష్, పూర్ణచంద్రరావు, తిరుపతిరావు, మధుసూధనరావు, వాకింగ్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఒజియల్ 02)బియ్యం,బిస్కెట్ ప్యాకెట్స్ తదితరాలను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

## నేడు కలెక్టరేట్ ఎదుట జరిగే 12 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయండి



గుంటూరు:- ప్యాఫ్టో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రేపు జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట జరిగే 12 గంటల నిరసన దీక్ష ను జయప్రదం చేయాలనీ ఎపిటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష/ ప్రధాన కార్యదర్శులు గోవిందు వెళాంగణిరాజు,మేకల సుబ్బారావు ఉపాధ్యాయులను కోరారు.

నగరంపాలెం నందలి జిల్లా కార్యాలయం లో నిరసన దీక్ష ను జయప్రదం చేయాలనే ,కరపత్రం లను వారు విడుదల చేసారు.

రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాత ఫెంక్షన్ పథకం నే కొనసాగించాలనీ కోరారు.

జిల్లా అధ్యక్షులు గోవిందు వెళాంగణి రాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అదికారులు ఉపాధ్యాయులను సరిగా పాఠాలు కూడ చెప్పకుండనీయకుండ,భయాబ్రాంతులకు గురిచేస్తున్నారనీ ,వారు విధానంలో మార్పులు రావాలనీ కోరారు.

జిల్లా ప్రదాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల కు గొడ్డలి పెట్టు లాంటి జి.ఓ నెంబరు 117 ను రద్దు చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు పాల్గొన్నారు

మేకల సుబ్బారావు ప్రధాన కార్యదర్శి గుంటూరు

## సినీ రంగమేమీ ఆకాశం నుంచి ఊడి పడలేదు: ఎంపీ విజయసాయిరెడ్డి

ఢిల్లీ: రాజకీయాలు, సినీ రంగంలపై వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే చిరంజీవి వ్యాఖ్యలపై విజయసాయిరెడ్డి కౌంటరిచ్చారు.

సినిమా స్టార్స్ అయినా పొలిటిషియన్స్ అయినా ప్రజలు ఆదరిస్తేనే వారికి మనుగడ అని చెప్పుకొచ్చారు. సినీ పరిశ్రమలోని పేదలు, కార్మికుల సంక్షేమం బాధ్యత కూడా ప్రభుత్వానిదే అంటూ ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు.

కాగా, ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్‌లో.. 'సినీ రంగమేమీ ఆకాశం నుంచి ఊడి పడలేదు. ఫిలిం స్టార్స్ అయినా పొలిటిషియన్స్ అయినా ప్రజలు ఆదరిస్తేనే వారికి మనుగడ. సినీ పరిశ్రమలోని పేదలు, కార్మికుల సంక్షేమం బాధ్యత కూడా ప్రభుత్వానిదే. వాళ్ళూ మనుషులే. వారి గురించి మీకెందుకు, వీరి గురించి ప్రభుత్వానికి ఎందుకంటే కుదరదు. వారి యోగక్షేమాల పట్టించుకునే బాధ్యత ప్రభుత్వానికి ఉంది' అని తెలిపారు.

అలాంటి వారికి హాట్సాఫ్..

ఇదే సమయంలో.. 'కొందరు సినిమా హీరోలు పాపం చాలా తక్కువ రెమ్యూనరేషన్ తీసుకొంటూ, వీలయితే ఉచితంగా నటిస్తూ....లక్షలాది డైలీ వేజ్ సినీ కార్మికులను బతికిస్తున్నారు. కళామతల్లిపై ప్రేమతో ఎక్కువ సినిమాలు చేస్తున్నారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కుంభా రవిబాబు, కర్రి పద్మశ్రీ

విజయవాడ: ఏపీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం ఆమోదించారు.

కాగా, ఏపీలో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న ఇద్దరు శాసన మండలి సభ్యుల స్థానాలను భర్తీ చేస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ప్రభుత్వ ఎక్స్అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులను జారీ చేశారు.



రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో నామినేట్ చేయబడిన కర్రి పద్మశ్రీ , కుంభా రవిబాబులను ఆ ఖాళీ స్థానాల్లో శాసన మండలి సభ్యులుగా నియమిస్తూ జీవోను జారీ చేశారు. గతంలో గవర్నరు కోటాలో శాసన మండలి సభ్యులుగా నియమించబడిన చాదిపిరాళ్ల శివనాథరెడ్డి, ఎన్.ఎం.డి.ఫరూక్ పదవీ కాలం జూలై 20వ తేదీతో ముగిసిన నేపథ్యంలో ఆ ఖాళీ స్థానాల్లో నూతనంగా వీరిరువురిని నియమిస్తూ ఈ ఉత్తర్వులను జారీచేశారు.

# ఘనంగా ఉద్యోగ విరమణ సభ



విజయవాడ, ప్రజా పాలన ప్రతినిధి ఆగష్టు 11: ఆంధ్రభూమి,డక్కన్ క్రానికల్ ఎంప్లాయిస్ యూనియన్ విజయవాడ యూనిట్ ప్రధాన కార్యదర్శి యాదల శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సభ శుక్రవారం కార్యాలయ ప్రాంగణం లో బ్రాంచ్ మేనేజర్ పి.వి.ఎస్. ప్రసాద్ అధ్యక్షతన ఎంతో ఘనంగా జరిగింది. యూనియన్ ఉమ్మడి రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి కె.జగన్ మోహనరెడ్డి (%ఎఎ%), ఆంధ్రభూమి విశ్రాంత బ్యూరో చీఫ్ మరియు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, నరసరావుపేట విశ్రాంత ఇన్చార్జ్ ఆరూరి రమేష్ తో పాటు విజయవాడ, నెల్లూరు,రాజమండ్రి, విశాఖ,అనంతపురం, హైదరాబాద్, కరీంనగర్ ఎడిషన్ ల యూనియన్ నాయకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమాజ హితం కోసం, సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న ఆంధ్రభూమి, డక్కెన్ క్రానికల్ సేవలను ప్రస్తుతించారు.

# విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించాలి - డివైఈవో



మచిలీపట్నం టౌన్ : ఆగస్ట్ 11, ప్రజాపాలన : విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించేందుకు కృషి చేయాలని మచిలీపట్నం డివైఈవో యువి సుబ్బారావు అన్నారు. భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో రాజుపేట లిటిల్ ఫ్లవర్ హై స్కూల్లో విద్యార్థులకు జాతీయ గీతాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు డివైఏవో బహుమతులు అందజేసి ప్రసంగించారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, జండా వీరుడు తోట నరసయ్య నాయుడు, విశ్వదాత కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, గురజాడ రాఘవ శర్మ వంటి ప్రముఖ స్వాతంత్ర సమరయోధులకు మచిలీపట్నం ఆనాడు ఒక వేదిక అయిందన్నారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను తలచుకుంటూ మన జాతి యావత్తు స్వాతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నా మన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో దేశభక్తి గేయాలు, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సభలో కార్యదర్శి ముదిగొండ శాస్త్రి, పాఠశాల ప్రిన్సిపాల్ వంకాయల నాగలక్ష్మి, కరస్పాండెంట్ వి నవీన్, సీనియర్ సిటిజన్ వాయిస్ సంపాదకులు పునుకొల్లు సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు విలువైన సాహిత్యం, నగదు బహుమతులు అందజేశారు.

# ఎన్నికల ప్రవర్తననియమావళి ఖచ్చితంగా పాటించాలి: జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు



పుట్టపర్తి, ప్రజా పాలన ప్రతినిధి ఆగస్టు 11 : ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ల పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని అని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు శుక్రవారం ఉదయం టెల్ కన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లను, ఈవో పి ఆర్ డి, వైద్య సిబ్బంది, ఎంపీడీవోలు మరియు తాహెల్దారులతో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎన్నికలకు అన్ని సిద్ధం చేసుకోవాలని, పంచాయతీలలో ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలని డిపిఓ ని ఆదేశించారు. వార్డ్ మెంబర్ల ఎన్నికలకు ఆగస్టు నెల 19వ తారీఖున పోలింగ్ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు , బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల నియమావళి మేరకు పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని , పోలింగ్ కు ముందుగా మద్యం దుకాణాలు మూసి వేయించడం , సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవడం వంటి నియమాలు కచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న గ్రామ , వార్డు సచివాలయ ఉద్యోగులకు పే స్కేల్ వర్తించే విధంగా వారికి ప్రొబేషన్ డిక్లేర్ చేయవలసిందిగా తెలిపారు.

# ఆదృశ్యమైన చిన్నారులు. రంగంలోకి దిగిన పోలీసులు మిస్సింగ్ కథ చేదించిన పోలీసులు





గోకవరం ఆగస్టు 11 ప్రజా పాలన పాఠశాలకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు ఆదృశ్యమైన సంఘటన గ్రామంలో తీవ్ర భయాందోళన నెలకొన్నాయి విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి తమదైన శైలిలో విచారణ వేగవంతం చేశారు. వివరాల్లోకి వెళితే గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలోని దళిత పేటకు చెందిన మైలపల్లి నాగేంద్ర కు చెందిన ఇద్దరు ఆడపిల్లలు సుస్మిత(6), భవ్య(8) అను ఇద్దరు ఆడపిల్లలు గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లారన్నారు. సుస్మిత, భవ్య ఇద్దరు పాఠశాలలో లేరని సమాచారం తెలుసుకున్న బంధువులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ ఇద్దరు చిన్నారులు ఆదృశ్యమైన అన్వేషణ కొనసాగించారు. గోకవరం పోలీసులకు కూడా సమాచారం అందడంతో పోలీసుల రంగ ప్రవేశం చేసి తమదైన శైలిలో విచారణ వేగవంతం చేశారు. అనుమానం గా ఎవరు కనిపించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రస్తుతం చిన్న పాప గుండుతో సివిల్ డ్రెస్ లో ఉందని, పెద్ద పాప స్కూల్ యూనిఫామ్ తో ఉందన్నారు. అదృష్టమైన ఇద్దరు చిన్నారుల కోసం ఇటు గ్రామస్తులు, బంధువులు అటు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పిల్లలు ఎక్కడికైనా వెళ్లారా, ఎవరైనా తీసుకుపోయారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పిల్లలు అదృశ్యంపై గ్రామంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

అదృశ్యంమైన చిన్నారుల కథ సుఖాంతం

గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో ఆదృశ్యమైన ఇద్దరు చిన్నారుల కథ సుఖాంతం అయ్యింది . ఇద్దరు చిన్నారులు గత రెండు రోజులుగా పాఠశాలలకు వెళ్ళకపోవడంతో ఈ రోజు పాఠశాలకు బయలుదేరిన ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా పక్కనే నూతనంగా నిర్మిస్తున్న ఒక ఇంటిలో వారికి వారే స్వచ్ఛందంగా దాక్కున్నట్లు గుర్తించారు. పోలీసులు గాలింపులో కొత్త ఇంటిలో ఇద్దరు చిన్నారులు కనిపించినట్లు గోకవరం ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు. పిల్లలు కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తక్షణం స్పందించి రంగంలోకి యుద్ధ ప్రతిపాదికన దర్యాప్తు చేపట్టిన పోలీసులకు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు

# జిల్లాలోని యువతను పెద్ద ఎత్తున ఓటర్లుగా చేర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశం

మచిలీపట్నం : ఆగస్ట్ 11, ప్రజాపాలన జిల్లాలోని యువతను పెద్ద ఎత్తున ఓటర్లుగా చేర్పించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు.

శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ వో యం వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, ఎన్నికల అధికారులు, క్షేత్రాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ, భూముల రీ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన యువతి యువకులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని తప్పనిసరిగా ఓటర్లుగా చేర్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా జిల్లా విద్యాధికారి అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లతో, ఏఈఆర్వో లైన తహసీల్దారులతో సమన్వయం చేసుకొని పెద్ద ఎత్తున యువజనులను ఓటర్లుగా నమోదు చేసుకునేలా చైతన్యపరచాలన్నారు.

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ముగింపు గడువు సమీపిస్తున్నందున అందరూ ప్రత్యేక శ్రద్ధ వహించి ఇంటింటి పరిశీలన కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు.

జిల్లాలోని 62 గ్రామాల్లో రెండో దశలో చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా రీ సర్వే పూర్తి చేయాలన్నారు. బందరు, ఉయ్యూరు డివిజన్లలో రోవర్సు సరిగా వాడటం లేదని సరిహద్దురాళ్ళు వచ్చినప్పటికీ నాటడం లేదని దీంతో సరైన పురోగతి లేకుండా పోతుందన్నారు. ఇకపై అలసత్వం చూపితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ వారం రోజుల్లోగా సరైన పురోగతి సాధించాలని సూచించారు. 20 గ్రామాల్లో రీ సర్వే తో పాటు సరిహద్దు రాళ్లు నాటడం జరిగిందని, ఇంకా రీ సర్వే పూర్తయిన 14 గ్రామాల్లో సరిహద్దు రాళ్ళను నాటే కార్యక్రమాన్ని కూడా మరింత వేగవంతం చేయాలన్నారు.

ఈ టెలి కాన్ఫరెన్సో మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు తహసిల్దార్లు పాల్గొన్నారు.

# 10వ రోజుకొనసాగినరాజన్నఉచితభోజనకార్యక్రమం



జగ్గయ్యపేట ఆగస్టు 11 ప్రజా పాలన ప్రతినిధి:దివం గత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవివ్, సామి నేని ఉదయభానునియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నిరంతరం జరిగే విధంగా ఏర్పాటు చేసిన రాజన్న ఉచిత భోజన కార్యక్రమం శు క్రవారం 10వ రోజు కొనసాగింది.నియోజకవర్గం నుం డి వలు వనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన విద్యార్థ లు,ఉద్యోగులు,వ్యాపారస్తులు,వివిధ వృత్తులకు చెం దినవారు పట్టణానికి చెందిన నిరుపేదలు,అనాధ వృ ద్ధులు,నిరాశ్రయులు 800 మందికి పైగా రాజన్న ఉచి త భోజనం చేశారు

# లబ్ధిదారుల ఇళ్లకే రేషన్ సరకుల పంపిణీ హర్షించదగ్గ పరిణామంలి

## ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ఆచరణీయం



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను లబ్ధిదారుల ఇళ్లకే అందిస్తున్న విధానం వినూత్న ప్రయత్నమని, ఆచరణీయమని కర్ణాటక రాష్ట్ర ఆహార మరియు పౌర సరఫరాల శాఖామాత్యులు కె.హెచ్. మునియప్ప ప్రశంసించారు. వ్యక్తిగత పనులపై విజయవాడ వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యాలయంను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మునియప్పకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి కార్యాలయంలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం గోడౌన్, ఎండీయూ వాహనం, పంపిణీకి సిద్ధంగా ఉన్న రేషన్ సరుకులను కె.హెచ్. మునియప్ప పరిశీలించి లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులను అందిస్తున్నందకు అభినందనలు తెలిపారు. అంతే గాక రాయలసీమ జిల్లాల్లో పంపిణీ చేస్తున్న రాగులు, జొన్నలు పరిశీలించి ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధను కొనియాడారు. రేషన్ సరుకుల్లో ఫోర్టిఫైడ్ బియ్యం అందించటం వల్ల లబ్ధిదారులకు పుష్కలంగా పోషకాహారం అందుతుందని, మధ్యాన్న భోజనంలో చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యంతో చేసిన అన్నం వడ్డించటం వల్ల వారు మరింత ఆరోగ్యంగా ఉంటారని మెచ్చుకున్నారు. బాలింతలు, గర్భిణీలు ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవటం వల్ల రక్తహీనత తదితర వ్యాధులు దరిచేరవన్నారు. రేషన్ ద్వారా పంపిణీ చేస్తున్న గోదుమపిండి తదితర సరుకుల నాణ్యత మెరుగ్గా ఉందని అన్నారు.ఆంధ్రప్రదేశ్ లో ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న విధానంపై మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ను పలు వివరాలు మునియప్ప అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను పరిశీలించి ఈ పద్ధతి ఎంతో చక్కగా ఉందని తమ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ తరహా విధానం అమలు చేయటానికి కృషి చేస్తానని తెలిపారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 12, ఆగష్టు 2023

# బుల్డోజర్లను న్యాయవ్యవస్థే అడ్డుకోవాలి!

కొద్దిరోజులుగా మతపరమైన అల్లర్లు చోటు చేసుకుంటున్న హర్యానాలోని 'ను' ప్రాంతంలో ఒక రోజు ఉదయం బుల్డోజర్ వెళ్లి అనీష్ అనే వ్యక్తి ఇల్లు కూల్చివేసింది. అనీష్ ముస్లిం అనీ, ఆ బుల్డోజర్ సర్కారు పంపగా వెళ్లిందనీ ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. కొన్నాళ్లుగా దేశంలో కొన్నిచోట్ల అమలవుతున్న బుల్డోజర్ న్యాయాన్ని గమనిస్తున్న వారికి హర్యానాలో కట్టర్ ప్రభుత్వం అమలు చేసిన న్యాయం చెప్పకుండానే అర్థం అవుతుంది. అనీష్ ఇల్లు కూల్చివేతకు ఆరు రోజుల ముందు ఒక మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు ఈ పట్టణానికి వచ్చారు. అక్కడ ఉద్రిక్తతలు ఉన్న సంగతి వారికి బహుశా తెలియదు. వారికి ఓ గుంపు ఎదురయింది. ఆగ్రహంతో ఉన్న ముస్లింల గుంపు అది. ఈ ముగ్గురూ హిందువులు. పరుగెత్తుకుంటూ వెళ్లి దగ్గర్లో ఉన్న ఒక ఇంటి దగ్గర తలదాచుకున్నారు. ఆ ఇంటి యజమాని తక్షణం ముగ్గురినీ లోపలకు తీసుకువెళ్లి, భయం లేదని చెప్పి, తినడానికి ఏవో పెట్టి సాయంత్రం వరకూ ఆశ్రయం ఇచ్చాడు. తర్వాత తన కారులోనే తీసుకువెళ్లి సురక్షితమైన చోట వదిలిపెట్టి వచ్చాడు. ఆ వ్యక్తి అనీష్ అని ఈ పాటికి మీకు అర్థమై ఉండాలి. ఆరు రోజుల తర్వాత అనీష్ ఇంటికి బుల్డోజర్ వచ్చింది. అనీష్ ఇంట్లో ఆశ్రయం తీసుకున్న ముగ్గురిలో రవీందర్ ఫోగట్ అనే వ్యక్తి తన ఫోన్ నంబర్ అనీష్‌కు ఇచ్చి వెళ్లాడు. బుల్డోజర్ రావడం చూసి అనీష్ తన కొత్త మిత్రుడికి ఫోన్ చేసి లబలబా మొత్తుకున్నాడు. రవీందర్ కూడా ఇదెక్కడ అన్యాయం అంటూ దానిని ఆపేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. ఫలితం లేకపోయింది. అనీష్ ఇల్లు నేలమట్టమయింది. అల్లర్ల అనంతరం 'ను' పట్టణంలో, గురుగ్రామ్ నగరంలో మనోహర్‌లాల్ కట్టర్ సర్కారు కూల్చివేసిన అనేక కట్టడాల్లో ఇదొకటి. 'ను' పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి పక్కన పదిహేను ఇరవై ఏళ్లుగా ఉన్న మెడికల్ షాపుల్ని కూడా కట్టర్ ప్రభుత్వం కూల్చివేసింది. అధికారులు చెప్పే మాట అవన్నీ అక్రమ కట్టడాలని. ఈ కూల్చివేతల ప్రహసనాన్ని స్యూమోటోగా చేపట్టిన పంజాబ్ హర్యానా హైకోర్టు, గురుగ్రామ్ కూల్చివేతలను తక్షణం ఆపాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అక్రమ కట్టడాలయితే ఇన్నాళ్లూ ఏం చేశారు, అల్లర్లు జరిగినపుడే అవి అక్రమ కట్టడాలన్న సంగతి ఎందుకు గుర్తుకువచ్చింది అనే ప్రశ్నలు సహజంగా ఉద్భవిస్తాయి. కానీ ఈ ప్రశ్నల వల్ల పెద్ద ఉపయోగం లేదు. అక్కడ సర్కారు వారి ఆంతర్యం స్పష్టంగా అర్థం అయిపోతూనే ఉంది. అక్రమ కట్టడాలయినంత మాత్రాన వాటిని చట్ట ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు ఏమీ లేకుండా కూల్చవచ్చా అన్న ప్రశ్నకు జవాబు కావాలి. నిజానికి ఏ మాత్రం ఇంగితం ఉన్నవారికయినా ఈ ప్రశ్నకు జవాబు తెలుసు. అలా కూల్చడం కుదరదు కాబట్టే హైకోర్టు ఎవరూ అడగకుండానే జోక్యం చేసుకుని స్టే ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఈ అరాచక న్యాయం అమలుకు శ్రీకారం చుట్టింది. సహచరులతో, ఆఖరికి బ్యూరోక్రాట్లతో కూడా మహరాజ్ అని పిలిపించుకునే ఆదిత్యనాథ్ తాను చేస్తున్న పనికి చాలా గర్వపడతారు. ముస్లింల సంగతి తేలుస్తానని బహిరంగంగా చెప్పగలిగిన ముఖ్యమంత్రి, 80శాతానికీ, 20శాతానికీ మధ్య జరిగే పోరాటమని ఎన్నికల ప్రచారంలో చెప్పగలిగిన ముఖ్యమంత్రి ఏలుబడిలో ఇవాళ బుల్డోజర్లు వస్తున్నాయి. రేపు ఇంకా ప్రమాదకరమైనవి రావచ్చు. ఆ 'మహరాజ్'ను చూసి మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్, హర్యానాలో కట్టర్ కూడా కట్టు తప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం ఏం చేయాలో అది చేసేందుకు రాజ్యాంగబద్ధంగా మనం రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఆ రాజ్యానికి అధికారం కట్టబెట్టింది మనమే. అంటే ప్రజలే ప్రభువులు. ఆ రాజ్యమే చట్టాన్ని ఉల్లంఘించి తన ప్రభువులైన ప్రజలకు హాని చేస్తున్నది. భారత్‌లో ఇది మరీ కొత్త పరిణామమేమీ కాదు. రాజ్యానికి ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలు ఏదో రకంగా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడడం ఎప్పుడో ఒకప్పుడు జరుగుతూనే ఉంది. అయితే ప్రజలకు వ్యతిరేకంగా ఇలా బహిరంగ నేరాలకు పాల్పడడం, ఆ నేరాలను కొనసాగిస్తామని ముఖ్యమంత్రులు, చట్టసభల సభ్యులు గర్వంగా ప్రకటించడం గతంలో ఎన్నడూ లేదు. ఒక వ్యక్తి మతం కారణంగా ఆ వ్యక్తి నివాసాన్ని కూల్చివేసి నడిరోడ్డులో కట్టుబట్టలతో నిలబెట్టడం ఎంత అధమ స్థాయి నేరం! ఆ పరిస్థితిలో మీరే ఉంటే? ఒక్కసారి ఆలోచించండి. హక్కులపై ఎంతటి హేయమైన దమనకాండ ఇది! ప్రభుత్వమే ఈ దమనకాండకు పాల్పడడమా? ఎలాంటి సమాజంలో ప్రభుత్వం ఇలాంటి నేరాలకు పాల్పడగలుగుతుంది? ఎలాంటి సమాజం ఇలాంటి నేరాలకు దన్నుగా నిలబడుతుంది? ఈ ఆటవిక న్యాయానికి ఇప్పటికి చట్టబద్ధత లేదు. రేపు పొద్దున్న చట్టబద్ధత తీసుకొచ్చినా ఆశ్చర్యపోనక్కర లేదు. నరేంద్ర మోదీ నాయకత్వంలో మత రాజ్యం దిశగా సాగుతున్న ప్రయాణాన్ని ఆపకపోతే ముందు ముందు మరెన్ని మజిలీలు చూడాల్సివస్తుందో! రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే వీసమెత్తు ఖాతరు లేకుండా పౌరసత్వానికి మతాన్ని ప్రాతిపదిక చేయగలిగిన ప్రభుత్వం మైనారిటీల హక్కులు మరింతగా హరించడానికి ఏమైనా చేయగలదు. చట్టాలు అనేవి ఉన్నంత కాలం ఆ చట్టాల అమలుకూ, ఉల్లంఘనలకూ బాధ్యత ఉండాలి. ఉల్లంఘించిన వారు చట్ట ప్రకారం మూల్యం చెల్లించాల్సి రావడమే ఆ బాధ్యత. న్యాయస్థానం జోక్యం చేసుకుని ను, గురుగ్రామ్ పట్టణాల్లోని కూల్చివేతలను ఆపడం బాధితులకు తప్పనిసరిగా ఊరట కలిగించే విషయమే. కానీ అంతటితో ఆగకూడదు. బాధ్యులు ఎవరో తేల్చి వారికి చట్టం నిర్దేశించిన ప్రకారం శిక్ష విధించినపుడే ఈ వ్యవహారం న్యాయబద్ధంగా ముగిసినట్లు లెక్క. కానీ ప్రభుత్వాలు చట్ట ఉల్లంఘనలకు పాల్పడినపుడు చాలా తక్కువ సందర్భాలలో జవాబుదారీతనం లెక్క తేలుతున్నది. మన రాజ్యాంగ నిర్మాతలు రాజకీయ పాలకులకు తక్కువ మోతాదులో జవాబుదారీతనం నిర్ణయించారు. పాలనలో మంచిచెడులకు అయిదేళ్ల తర్వాత ప్రజలు ఇచ్చే తీర్పే తగిన ప్రతిఫలమన్నది వారి ఆలోచన. వారికి బదులు నేరుగా బాధ్యత స్వీకరించే పని బ్యూరోక్రసీ నెత్తిపై పెట్టారు. అందుకే ప్రభుత్వం తప్పొప్పులు కోర్టుకు ఎక్కినపుడు న్యాయస్థానం ముందు నుంచునేది మంత్రి కాదు, సంబంధిత కార్యదర్శి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తప్పుడు పనులు చేయకుండా ఉండేందుకు ఆ బ్యూరోక్రాట్లకు రాజ్యాంగ రక్షణ కల్పించారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా వ్యవస్థ ప్రజలను వెక్కిరిస్తూనే ఉన్నది. రాజకీయ పాలకులూ, బ్యూరోక్రాట్లూ కుమ్మక్కయి తమను సృష్టించిన రాజ్యాంగం ఎవరినైతే ప్రభువులుగా గుర్తించిందో వారికి అన్యాయం చేస్తూనే ఉన్నారు. వారి హక్కులను హరిస్తూనే ఉన్నారు. ఇక్కడే న్యాయవ్యవస్థ రంగంలోకి వస్తుంది. చేయాల్సిన పనులు చేయకపోవడం సంగతి ఎలా ఉన్నా చేయకూడని పనులు చేసిన ప్రతి సందర్భంలోనూ బాధ్యులను గుర్తించి శిక్షించినపుడే బ్యూరోక్రాట్లు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా చట్టబద్ధ పాలనకు కట్టుబడతారు.

# రాజ్యాంగం రాజకీయం వేరైన దుస్థితి!




పంద్రాగస్టు పండగ అంటే-- మువ్వన్నెల జెండా ఎగరవేసి, జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి, సాయంత్రం టీవీలో సర్దార్ పాపారాయుడు లాంటి దేశభక్తి సినిమా చూసి ముగించే సెలవు దినంగా చూడడం ఆనవాయితీగా వస్తూ ఉన్నది. కానీ ఎంతకాలం ఇలా? మనం ఒక జాతిగా మరికాస్త లోతుగా ఆలోచించవలసిన అవసరం ఉంది. అందుకు అమృతోత్సవాలు ముగిసిన తర్వాత వస్తున్న ఈ పంద్రాగస్టును ఒక సందర్భంగా భావించవచ్చు.

మనది ఒకనాడు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. కానీ నేడు అది ప్రధానమంత్రిత్వ ప్రజాస్వామ్యంగా మారిపోయింది. ఈ స్థితిలో రాజ్యాంగ వ్యవస్థ అంతా ఒక్క వ్యక్తి చుట్టూ పరిభ్రమిస్తున్నది. ఆ వ్యక్తే శక్తిగా మారి యావత్ దేశాన్ని శాసించే పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా మన రాజ్యాంగంలో పార్లమెంటుకు కల్పించిన విశిష్ట స్థానాన్ని మనం నిలబెట్టుకోలేకపోయాము. ఒక వ్యవస్థగా పార్లమెంటు మొదటి నుంచీ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మ అయ్యింది.

పార్లమెంటరీ పరిభాషలో మంత్రులు మినహా, సభ్యులందరూ ప్రైవేట్ మెంబెర్స్‌గానే పరిగణింపబడతారు. అధికార పక్షం సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు అనే తేడా లేదు. ప్రభుత్వ తీరును సునిశితంగా గమనిస్తూ, ప్రశ్నల రూపంలో ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టాల్సిన బాధ్యత సభ్యులందరిదీ. ఈ బాధ్యత పార్టీలకతీతమైనది. కానీ, రాజకీయ కారణాలతో, ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనించే పాత్రను సభ్యులు విస్మరించారు. అధికార పక్షం సభ్యులు గనక ప్రభుత్వ పనితీరు మీద అదే పనిగా ప్రశ్నలు సంధించుతుంటే పార్టీ నాయకత్వం దృష్టిలో అసమ్మతివాదులుగా ముద్రపడతారు అని భయం. వచ్చే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్టు దక్కదని భయం.

పరిణతి గల ప్రజాస్వామ్య వ్యవస్థలో సభలో ప్రజాప్రతినిధుల పాత్రకు నాలుగు కోణాలుంటాయి. మొదటగా తమ మనస్సాక్షి ప్రకారం నడుచుకోవాలి. రెండవది తనను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకు నడుచుకోవాలి. మూడవది పార్టీకి విశ్వసనీయంగా నడచుకోవాలి. తనకు టిక్కెట్టు ఇచ్చిన పార్టీ నాయకత్వం, మేనిఫెస్టో, ఎన్నికల గుర్తు, పార్టీ కార్యకర్తలు, నాయకులు చేసిన ప్రచారం ఆధారంగా గెలుపొందుతారు గనక పార్టీ పట్ల బాధ్యతను విస్మరించరాదు. ఇహ నాలుగవది ఏ రాజ్యాంగం మీద ప్రమాణం చేశారో ఆ రాజ్యాంగ విలువలను నిలబెట్టే విధంగా నడుచుకోవాలి. కొన్ని సందర్భాల్లో సభ్యులు ఈ నాలుగు కోణాల మధ్య సంఘర్షణకి లోనవుతారు. సభ్యుల విజ్ఞత, పరిణతితోనే ఈ సంఘర్షణ నుంచి బయటపడగలరు. అయితే నేడు కేవలం పార్టీ అభీష్టం మేరకే నడుచుకోవటానికి మొగ్గు చూపుతున్నారు.

అందువలన ప్రశ్నించటం అనేది ప్రతిపక్షాలకే పరిమితమైంది. కానీ ప్రభుత్వం ఏమి చేసినా వ్యతిరేకించాలి అన్న ధోరణిలో ఉంటున్నాయి ప్రతిపక్షాలు ఈ మధ్యకాలంలో. ప్రతిపక్షం ప్రజల మనోభావాలను ప్రతిబింబించేలా వ్యవహరించాలిగానీ ప్రతిపక్షం కాబట్టి ప్రభుత్వం ఏం చేసినా దాన్ని వ్యతిరేకించాలనుకోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకం. అది ప్రజల తీర్పును గౌరవించకపోవటమే.

సభాధ్యక్షుడిగా పిలవబడే స్పీకరు అధికారపక్షానికి అనుకూలంగానే నడుచుకుంటున్నారు గానీ స్వతంత్రంగా ఉండరు వారి విధినిర్వహణలో. దీనికి కారణం కూడా స్వతంత్రంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్టు రాదన్న భయమే. పైగా స్పీకరు కన్నా మంత్రి పదవి మీద మక్కువ ఎక్కువ మన నాయకులకి. పరిపాలనలో మంత్రులకు ఉండే అధికారం స్పీకరుకు ఉండదు కదా. ఆ విధంగా స్పీకరు పదవిని కూడా రాజకీయం నిర్వీర్యం చేసింది. స్పీకరు పనిభారం తగ్గించటానికి రాజ్యాంగం డిప్యూటీ స్పీకరు పదవిని కల్పించింది. ఈ పదవికి పెద్దగా అధికారాలు లేకపోయినా కొంత హంగు ఆర్భాటం ఉంటాయి. అయితే ఈ పదవిని రాజకీయాలకు త్యాగం చేశారు మన నాయకులు. స్వతంత్రం వచ్చిన తరువాత మొట్టమొదటిసారి లోక్?సభలో అధికార పక్షానికి తగినంత బలం ఉన్నా కూడా డిప్యూటీ స్పీకరు పదవిని ఖాళీగా ఉంచిన ఘనత నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానిది.

మన రాజ్యాంగంలో గవర్నరు పదవిలో ఉన్నవారు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. కానీ క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న నేతలను గవర్నర్లుగా నియమించటం వలన రాజ భవనాలు రాజకీయ కలాపాలకు వేదికలుగా మారినవి.

మన వ్యవస్థలో ప్రధానమంత్రిది అత్యంత కీలక స్థానం. మన ప్రధాని ఒక రాజకీయ నేతగా మాత్రమే కాకుండా రాజనీతిజ్ఞుడిగా దేశానికి దిశాదశా సూచించాలని ఆశిస్తుంది మన రాజ్యాంగం. కానీ నేటి ప్రధానులకు వ్యక్తిత్వం కన్నా వక్తృత్వమే ఆయుధంగా మారింది. అందుకే నేడు అంతా రాజకీయ కోణమేగానీ దేశ ప్రయోజనాలు ముఖ్యం కాకుండాపోయాయి. దేశం ఎదుర్కొంటున్న సమస్యలపట్ల అవగాహన లేదు. భాషలో సౌమ్యత లేదు, భావంలో హుందాతనం లేదు. మణిపూర్ మండుతుంటే ప్రధాని పార్లమెంటుకు రాకుండా మౌన ముద్రదాల్చటం దేశ ప్రజలకు చాలా కష్టం కలిగించింది.

సామాన్యుడు అవస్థలో ఉన్నప్పుడు ఆఖరి ఆశాకిరణంగా ఉండాల్సిన న్యాయ వ్యవస్థ కూడా నేడు అవస్థలో వున్నది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటానికి స్వతంత్రంగా వ్యవహరించే మీడియా సంస్థలే ఆఖరి ఆశాకిరణం. కానీ మన దేశంలో మీడియా తన పాత్ర పోషిస్తున్నదా అన్నది ఒక ప్రశ్న. ఈ విషయంలో జాతీయ మీడియా సంస్థల కన్నా కనీసం ప్రాంతీయ మీడియా సంస్థలు మెరుగుగా పని చేస్తున్నాయి అనిపిస్తున్నది.

# మణిపూర్ ఘర్షణల్లోకి ఆరెస్సెస్‌ను లాగుతారేం?

'అబద్ధాలబాటపై అంతర్యుద్ధం వైపు అడుగులు!' అంటూ ఎన్. వేణుగోపాల్ రాసిన వ్యాసం (04.08.2023) రాష్ట్రీయ స్వయం సేవక సంఘం (ఆరెస్సెస్)పై అనవసరమైన ద్వేషాన్ని, ఆక్రోశాన్ని ఆపాదించే విధంగా ఉంది. మణిపూర్ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు మూల కారణాలను విశ్లేషించకుండా, అందుకు కేవలం హిందూ సంస్కృతిని అనుసరించే మెయితీ తెగ ప్రజలు, అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రమే కారణమని ఏకపక్షంగా నిర్ణయించడం వాస్తవాలను దాచివేయడమే! ఎన్. వేణుగోపాల్ తమ వ్యాసంలో 'మెయితీలు చేసిన మూకదాడులలో దాదాపు రెండు వందల మంది హత్యకు గురయ్యారనీ, వేలాది మంది గాయపడ్డారనీ, నిరాశ్రయులయ్యారనీ, వందలాది గ్రామాలు, క్రైస్తవ చర్చిలు తగులపెట్టబడ్డాయనీ, అనేకమంది ఆదివాసీ స్త్రీలు అత్యాచారాలకు గురయ్యారనీ', చెబుతూ, 'కుకీలు చేసిన ప్రతిదాడులలో కూడా మెయితీలకు ప్రాణనష్టం జరిగింద'ని ఓ మాటతో సరిపెట్టారు. కుకీల విషయంలో ఎంతమంది చనిపోయిందీ, ఎన్ని చర్చిలు ధ్వంసం అయిందీ, ఎంతమంది నిరాశ్రయులైనదీ లెక్క చెప్పి, అవతల వైపు ఎంతమంది చనిపోయారు అనే విషయంలో లెక్కలు దాచడం ఎందుకు?



దేశంలో ఏ ప్రాంతంలో మత ఘర్షణ జరిగినా -- అందులో ఆరెస్సెస్ పాత్ర ఉందని అబద్ధాలు అల్లేందుకు ఈ దేశంలో ఒక ప్రత్యేక వ్యవస్థే నడుస్తూ ఉన్నది. ఆ సంస్థను దూషించకుండా, ద్వేషించకుండా ఉంటే ఈ వ్యవస్థకు ఉనికే కరువవుతుంది. మణిపూర్ సంఘటనలలో కూడా ఆరెస్సెస్ ప్రమేయాన్ని చొప్పించడం, ఆ సంస్థపై అభాండాలు వేయడమనే దురుద్దేశం ఈ వ్యాసంలో స్పష్టంగా కనబడుతున్నది. సోషల్ మీడియా ఫ్యాక్టరీల పది అబద్ధాలు అంటూ వాటిని సుదీర్ఘంగా వివరించారు వ్యాసకర్త. వారివి అబద్ధాలు అయినప్పుడు%--% మెయితీలు కుకీ తెగల భూములు లాక్కోవాలనే ప్రయత్నం, కుకీ తెగలు ఉపయోగించే ఆయుధాలు చైనా, మయన్మార్ దేశాల నుంచి రాలేదని చెప్పడం, మయన్మార్ నుంచి చొరబాటుదారుల ప్రమేయం లేదని బుకాయించడం, స్వదేశీ పారిశ్రామికవేత్తలకు మణిపూర్ అడవులను, ఖనిజ సంపదను దోచి పెట్టాలన్నది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దురుద్దేశమనడం, క్రైస్తవ మతంపై వ్యతిరేకత హిందూ మతోన్మాదం మణిపూర్ సంఘర్షణలకు ఒక కారణమనడం%--%వేణుగోపాల్ నిరాధారంగా తన వ్యాసంలో ప్రస్తావించిన ఈ అంశాలు సత్యశోధన కిందికి వస్తాయా?

ఈశాన్య రాష్ట్రాల నేపథ్యాన్ని విశ్లేషిస్తే -- అస్సాం, నాగాలాండ్, మిజోరం రాష్ట్రాలలో చెలరేగిన తీవ్రవాద గ్రూపుల హత్యలు, అరాచకాలు, భారత ప్రభుత్వ వ్యతిరేక చర్యలు లెక్కలేనన్ని! 'ఇండియన్ డాగ్స్ గో బ్యాక్' అనే నినాదాలతో ఒకప్పుడు ఈశాన్య ప్రాంతమంతా దద్దరిల్లింది. నాడు కేంద్రంలోనూ, త్రిపుర మినహాయించి తక్కిన ఈశాన్య రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. దేశ విభజన సమయం నుంచి నేటి వరకు చోటు




చేసుకున్న మత సంఘర్షణలను, నరమేధాలను విశ్లేషిస్తే -దేశంలో మత ఘర్షణలకు, అశాంతికి కారకులు ఎవరో, నష్టపోయింది ఎవరో, అన్ని మతాల సారం ఒకటేనని నమ్మి, మోసపోతున్న హిందువుల దయనీయ స్థితి ఏమిటో స్పష్టమౌతుంది. కశ్మీరు లోయలో లౌకికవాద ప్రభుత్వాల సాక్షిగా జరపబడిన నరమేధం నేపథ్యంలో, మణిపూర్ హింసమీద పార్లమెంటును స్తంభింపజేయడం, ఈయూ, అమెరికా బ్రిటన్ పార్లమెంటులు నిరసనలను తెలియజేయడం వంటి పరిణామాలను గమనిస్తే వెనుక ఉన్న వాస్తవం బోధపడుతుంది.

లౌకికవాదం ముసుగు వేసుకొని తాము చెప్పిందే సత్యమని బుకాయించేవారి ఆలోచనా సరళి మారాలి. ప్రతీ విషయంలో హిందువులను దోషులుగా నిలబెట్టే పరిస్థితి మారకపోతే- ఈ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం కనుమరుగవుతాయి. దేశ విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, రాజకీయ పార్టీలూ, వాటి అనుబంధ సంస్థలూ, వాటి అనుయాయులు విజ్ఞతతో వ్యవహరిస్తే మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలు చెక్కబడతాయి.

# ఆగని భూ కబ్జాలు

హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములు పెద్ద మొత్తంలో కబ్జాలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూము ల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయనే సమచారం రెవెన్యూ అధికారులకు ఉన్నా కాపాడే యత్నం చేయడం లేదు. కనీసం స్థలం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో కబ్జా రాయుళ్లు మరింతగా రెచ్చిపోతున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో దర్జాగా ప్రభుత్వ భూమిలో ఏకంగా రోడ్ల నిర్మాణం చేపట్టారు. ట్రాక్టర్‌తో చదును చేసి హద్దు రాళు పాతారు. నాలుగు రోజులుగా కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిలో అడ్డా వేసి మరీ కబ్జాకు యత్నిస్తున్నారు.



ప్రభుత్వ స్థలంలో ఎలాంటి చర్యలు చేపట్టరాదనే నిబంధనలు ఉన్నా వేంపల్లి గ్రామంలో అవేమీ అమలు కావడం లేదు. పాలకుల కనుసన్నల్లో నాలుగు రోజుల క్రితం కొందరు ప్రైవేటు వ్యక్తులు స్థలంలో కొలతలు తీయడం వివాదాస్పదంగా మారింది. ఇటీవల బదిలీపై వెళ్లిన మండల సర్వేయర్ ఒకరు ఇందుకు సహకరించడం చర్చనీయాంశం అవుతోంది. తన పరిధి కాకపోయినా ఏకంగా ప్రభుత్వ స్థలంలో సర్వేయర్ పర్యటించడం, అతను దగ్గరుండి కొలతలు తీయించడం వివాదాస్పదంగా మారింది. వేంపల్లి శివారు సర్వే నంబర్ 210లో మూడెకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. అందులో ఇప్పటికే కొందరు ఇళ్ల నిర్మాణం చేసుకోగా తాజాగా అధికార పార్టీ అండదండలతో కొందరు మిగతా స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉండడంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు ప్రభుత్వ భమిని కబ్జా

# మహాత్మా గాంధీ నరసరావుపేట పురపాలక సంఘం బాలుర ఉన్నత పాఠశాలలను అకస్మాత్ తనిఖీ చేపట్టిన.. -నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి .




పల్నాడు జిల్లా. నరసరావుపేట. ఆగస్టు 11. (ప్రజాపాలన ప్రతినిధి ): నరసరావుపేట పట్టణంలోని స్థానిక మహాత్మా గాంధీ నరసరావుపేట పురపాలక సంఘం బాలుర ఉన్నత పాఠశాలలను అకస్మాత్ తనిఖీ చేపట్టిన గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనంతరం విద్యార్థుల తరగతి గదులు, వంటశాల, భోజనశాలను, బాత్ రూమ్ లు పరిశీలించారు విద్యార్థులకు మంచినీటి ఆరో ప్లాంట్ మరియు పారిశుభ్రత అధ్వానంగా ఉండటం గమనించిన డాక్టర్ గోపిరెడ్డి గారు పాఠశాల హెచ్ఎం గారు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని పార్టీ నేతలతో మరియు విద్యాశాఖ అధికారులతో కలిసి భోజనం చేశారు. నరసరావుపేట పురపాలక సంఘం బాలుర ఉన్నత పాఠశాలకు కావలసిన వసతులను గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి ఉపాధ్యాయులు వివరించారు అనంతరం పాఠశాలకు కావాల్సిన వసతులను తక్షణమే అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి కొవ్వలి ఫౌండేషన్ ఆర్థిక సహాయం



నరసాపురం, ఆగస్టు 11 (ప్రజాపాలన ప్రతినిధి) : ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ముందుంటారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు లక్కు శ్రీను అన్నారు. మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామం యాళ్లవారి మెరకలో మల్లిపూడి వెంకటేశ్వరరావు ప్రమాదానికి గురై అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బంది పడుతున్నారు. వెంకటేశ్వరరావు పరిస్థితి తెలుసుకున్న కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు రూ 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కొవ్వలి ఫౌండేషన్ ద్వారా అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావుతో పాటు ఆయన తల్లి మల్లిపూడి లక్ష్మికి ప్రభుత్వం ఇచ్చే పింఛనుతోనే జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. వారు ఆర్దికంగా పడుతున్న ఇబ్బందులను కొవ్వలి రామ్మోహన్ నాయుడు తెలుసుకుని ఆర్థికసాయం అందించారని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి, పేదలకు కొవ్వలి ఫౌండేషన్ ద్వారా రామ్మోహన్ నాయుడు చేస్తున్న సేవలు ఆదర్శనీయంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర నాయుడు, యాళ్ల అబ్బులు, యాళ్ల నరసింహారావు, తోట సత్యనారయణ, యాళ్ల కృష్ణ, గన్నాబత్తుల బెనర్జీ, రంగిసెట్టి శివ, మల్లాడి మూర్తి, యర్రంశెట్టి నాగేశ్వరావు, రేవు పద్మారావు, గ్రంధి లక్ష్మీ నాయుడు , నిమ్మకాయల బాబ్జి, ముత్యం, నంద్యాల హనుమంతు తదితరులు పాల్గొన్నారు

# కోటి మంది అక్కచెల్లెమ్మలకు ఖాతాల్లోకి రూ.1,353.76 కోట్ల వడ్డీ రీయింబర్స్మెంట్.

## నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి.






పల్నాడు జిల్లా. నరసరావుపేట. ఆగస్ట 11( ప్రజా పాలన ప్రతినిధి.)5036 గ్రూప్ గాను 50,390 మంది అక్కాచెల్లెమ్మలకు సున్నా వడ్డీ కింద 7 కోట్ల 33 లక్షలు లబ్ధి, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు చెక్కులను అందజేసిన నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మరియు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఐ.ఏ.ఎస్.

పల్నాడు జిల్లాకు సంబంధించి 4,14,910 మంది డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు సున్నా వడ్డీ కింద 58 కోట్ల 02 లక్షల రూపాయలను ప్రభుత్వం శుక్రవారం తమ ఖాతాల్లో జమ చేసింది. ఈ సున్నా వడ్డీ చెక్కులను పల్నాడు జిల్లా కలెక్టర్ లిలోతేటి శివశంకర్ గారు ఐ.ఏ.ఎస్, నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి లి కలెక్టరేట్ లో జరిగిన సున్నా వడ్డీ పథకం కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా అక్కా చెల్లెమ్మలు స్వయం సమృద్ధి చెందాలని, మహిళా సాధికారత దిశగా జగనన్న వేస్తున్నా అడుగులు నేడు ఫలితాలు ఇస్తున్నాయన్నారు. డ్వాక్రా రుణాలు తీసుకునేందుకే భయపడే పరిస్థితుల నుంచి నేడు ధైర్యంగా రుణాలు తీసుకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని ఉపాధి పొంది కుటుంబానికి అండగా ఎక్కువమంది మహిళలు నిలుస్తున్నటువంటి సందర్భాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఇక్కడికి వచ్చినటువంటి ఎక్కువ మంది డ్వాక్రా మహిళలు ఈ రుణాలతో పశువులని కొనుగోలు చేయడం గానీ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు సామాగ్రి ఏర్పాటు చేసుకోవడం గాని ఉపయోగిస్తూ వారి ఆర్థిక సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగానే అక్కచెల్లెమ్మలను ఆదుకుంటామని లిజగనన్నలి ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు వడ్డీ లేని రుణాలను వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

నారా చంద్రబాబు నారీ వ్యతిరేక చరిత్ర ఇదీ.

చంద్రబాబు హయాంలో 2014-19 మధ్య పొదుపు సంఘాలకు రూ. 14,205 కోట్లు చెల్లించకుండా అక్క చెల్లెమ్మలను మోసం చేశారని సీఎం జగన్ విమర్శించారు. 2016లో సున్నా వడ్డీ పథకాన్ని చంద్రబాబు రద్దు చేసి డ్వాక్రా సంఘాలను నడి రోడ్డుపైకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి మిగిలిచ్చిన అప్పులన్నీ 2019 ఏప్రిల్ నాటికి రూ.25,571 కోట్లకు ఎగబాకాయని వీటిలో 18.36 శాతం మొండి బకాయిలుగా ఉన్నాయని బ్యాంకులు తేల్చాయని సీఎం జగన్ పేర్కన్నారు. ఆ రోజుల్లో నారా చంద్రబాబు నారీ వ్యతిరేక చరిత్ర రాశారని సీఎం జగన్ చంద్రబాబుకు చురకలు అంటించారు. అప్పులు తడిసి మోపెడై పొదుపు సంఘాలు నిర్వీర్యమైన పరిస్థితిని రాష్ట్రంలో తెచ్చారని విమర్శించారు..

మన సంక్షేమ ప్రభుత్వంలో వెలుగుతున్న డ్వాక్రా సంఘాలు..

గత ప్రభుత్వం హయాంలో 90 లక్షల మంది మహిళలు పొదుపు సంఘాల్లో ఉంటే.. ప్రస్తుతం 1.16 కోట్ల మంది అక్క చెల్లెమ్మలు పొదుపు సంఘాల్లో ఉన్నారని సీఎం జగన్ తెలిపారు. ఈ నాలుగేళ్లలో మహిళల కోసం అనేక పథకాలు తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. అక్కచెల్లెమ్మలు బాగుండాలి, వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని సంక్షేమ పథకాలు ఇస్తున్నామన్నారు. ఇలాంటి పథకాలు గతంలో ఎప్పుడూ చూసింది లేదు, దేశంలోనే ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ నాలుగేళ్లలో సంక్షేమ పథకాలతో ఎంత మంచి జరిగిందో సీఎం జగన్ వివరించారు. మహిళలు రాజకీయంగా కూడా ఎదగాలని, నామినేటెడ్ పదవులు, పనుల్లో చట్టం చేసి అమలు చేస్తున్న ప్రభుత్వం మనదని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడానికి దిశ చట్టం తీసుకొచ్చాం. మహిళలు సాధికారత సాధించాలని బలంగా నమ్మి చేస్తున్న కార్యకరమాలు ఇవన్నీ అని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని సామాజిక వర్గాల వారికి మేలు చేకూరుస్తున్న ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రివర్యులు లిశ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డిలి గారికి మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. 2024లో లిజగన్మోహన్ రెడ్డిలి గారిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అంత ఐక్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, డ్వాక్రా మహిళలు, మెప్మా పీడీ , డిఆర్డిఏ పిడి , వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను నమ్మించి మోసం చేస్తున్న జగన్.




పల్నాడు జిల్లా. నరసరావుపేట. ఆగస్ట 11 (ప్రజా పాలన ప్రతినిధి.)బీసీలను నమ్మించి మోసం చేస్తున్న జగన్ ప్రభుత్వం అని బిసి సాధికారక కమిటీ రాష్ట్ర నాయకులు కన్వీనర్ అన్నారు శుక్రవారం

స్థానిక నరసరావుపేట పార్లమెంట్ ఆఫీసులో ఏర్పాటు చేసినటువంటి పత్రిక సమావేశంలో పాల్గొన్న బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్లు....

లితెలుగుదేశం పార్టీ భట్రాజు సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నాంజనేయ రాజు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) పాలకమండలి చైర్మన్ పదవికి బీసీని నియమిస్తానని చెప్పి మోసం చేశారు. మూడవ పర్యాయంలో కూడా అదే సామాజికవర్గానికి మళ్ళీ టీటీడీ పదవి కట్టబెట్టారు. తెలుగుదేశం పార్టీ హయాంలో టీటీడీ చైర్మన్లుగా బీసీలకు అవకాశం కల్పించారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీ వర్గాలకు ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేస్తుంది అని.. లితెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి కన్వీనర్లు గుర్రపు శాల రామకృష్ణలి మాట్లాడుతూ... జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీలను పలుమార్లు మోసం చేస్తూ మోసపూరితమైన వాగ్దానాలతో పబ్బ%శీ% గడుపుతుందని, టిటిడి విషయంలో కూడా మరొక్కసారి బీసీలకు మొండి చేయి చూపించి బీసీల వ్యతిరేకిగా మిగిలారని,, రాబోయే ఎలక్షన్లలో ఎన్నికలలో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని ,, ఎప్పటికైనా బీసీల అభివృద్ధి ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని 2024 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచే బీసీల అభివృద్ధికి శ్రీకారం చూస్తుందని తెలిపారు . నరసరావుపేట బీసీ సెల్ అధ్యక్షులు నరసింహారావు మాట్లాడుతూలి..

బీసీల ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది కేవలం తెలుగుదేశం పార్టీ అని గత ప్రభుత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి పాలకమండలి చైర్మన్గా బీసీ వర్గాల వారిని నియమించగా, ఈ ప్రభుత్వం కేవలం వారి యొక్క సొంత కుటుంబానికే కేటాయించటం వారి యొక్క స్వార్థపూరితమైన విధానానికి ప్రతిబింబంలాగా కనిపిస్తుందని వాపోయారు.

# "పని ఒత్తిడిని అధిగమించడం ఎలా? " అంశం పై ఎస్వీ యూనివర్సిటీ మాజీ రెక్టార్, ప్రొఫెసర్ వి. శ్రీకాంత్ రెడ్డి,"సమాజంలో ప్రభుత్వ మాధ్యమాల పాత్ర " అంశం పై ఆర్.ఎన్.యూ, దూరదర్శన్ ప్రాంతీయ వార్తా విభాగ అధిపతి డా. జి. కొండల రావు, ఐ.ఐ.ఎస్ -సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు

విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యం లో "డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులతో పాటు, రాష్ట్రం లోని వర్కింగ్ జర్నలిస్టులకు నిర్వహిస్తోన్న ఆన్ లైన్ అవగాహనా తరగతుల్లో భాగంగా ఈ శనివారం (12-08-23)న , ఎస్వీ యూనివర్సిటీ మాజీ రెక్టార్ ప్రొఫెసర్ వి. శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక ప్రసంగం ఇవ్వనున్నారని ఆ సంస్థ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. "పని ఒత్తిడిని అధిగమించడం ఎలా?" అనే అంశం పై శనివారం ఉదయం 9నుంచి 10 గంటల వరకు ప్రొఫెసర్ వి. శ్రీకాంత్ రెడ్డి ప్రసంగిస్తారని ఆ ప్రకటన లో చైర్మన్ పేర్కొన్నారు. "డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అదే రోజు "సమాజంలో ప్రభుత్వ మాధ్యమాల పాత్ర " అనే అంశం పై ఆర్.ఎన్.యూ, దూరదర్శన్ ప్రాంతీయ వార్తా విభాగ అధిపతి డా. జి. కొండల రావు, ఐ.ఐ.ఎస్ ఉదయం 8నుంచి 9 గంటల వరకు ప్రత్యేక ప్రసంగం ఇస్తారని, డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ గా తాము అధ్యక్షత వహిస్తామని, కోర్సు కోఆర్డినేటర్ ఎల్.వి.కె. రెడ్డి పరిచయ కర్తగా, మీడియా అకాడమీ కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు సమన్వయ కర్తగా వ్యవహరిస్తారని చైర్మన్ ఆ ప్రకటనలో తెలిపారు.





# ప్రజలకు మేలు చేసే ఏదైనా స్కీం రావాలంటే, ఐస్ క్రీం లాంటి చల్లని మనసు సైతం ఉండాలి - మంత్రి ఆర్కే రోజా

## జిల్లావ్యాప్తంగా 35,752 గ్రూపులకు రూ.46.02కోట్లు చెక్కు పంపిణీ

## జగనన్న ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వం



అవనిగడ్డ : ఆగస్ట్ 11, ప్రజాపాలన ప్రజలకు మేలు చేసే ఏదైనా స్కీం రావాలంటే, ఐస్ క్రీం లాంటి చల్లని మనసు సైతం ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన అభ్యుదయ శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కృష్ణాజిల్లా అవనిగడ్డ ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో 4 వ విడత వైఎస్సార్ సున్నావడ్డీ పథకం జిల్లా స్థాయి కార్యక్రమం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ, గతంలో రుణాలు సకాలంలో చెల్లించని కారణంగా సంఘాల పరపతి దెబ్బతిని అప్పటివరకు "ఏ", "బి" గ్రేడ్ లో ఉన్న సంఘాలు "సి" మరియు "డి" గ్రేడ్లకు దిగజారాయని గుర్తు చేశారు. అయితే, జగనన్న ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 35 వేల 752 స్వయం సహాయక సంఘాలు, 3 లక్షల 77 వేల 347 మంది అక్క చెల్లెమ్మలకు రూ. 46.02 కోట్లు, కేవలం అవనిగడ్డ నియోజకవర్గంలో 6,095 స్వయం సహాయక సంఘాలు 65 వేల 391 అక్క చెల్లెమ్మలకు రూ. 7.10 కోట్ల రూపాయలు, ఇక రాష్ట్రవ్యాప్తంగా అర్హత గల 9.48 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 1,05, 13, 365 మంది అక్కచెల్లెమ్మలు బ్యాంకులకు చెల్లించినట్లు తెలిపారు. అలాగే, రూ. 1,353.76 కోట్ల వడ్డీని రీయింబర్స్ చేస్తూ వారి తరవున అదే అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో బటన్ నొక్కి నేరుగా జమ చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అని తమ ప్రభుత్వం మహిళ పక్షపాత ప్రభుత్వమని మంత్రి రోజా అన్నారు. ఇప్పుడు అందిస్తున్న రూ. 1,353.76 కోట్లతో కలిపి "వైఎస్సార్ సున్నావడ్డీ" క్రింద అందించిన మొత్తం సాయం రూ. 4,969.05 కోట్లు అని తెలిపారు

నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కోట్లాదిమంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉంటారనే నమ్మకం తనకుందని మంత్రి రోజా విశ్వాసం వ్యక్తం చేశారు.

మన రాష్ట్రంలోని మహిళలు వారి కాళ్ళ మీద వారు నిలబడేలా, తద్వారా వారి జీవనోపాధి మెరుగుపడేలా.. బహుళ జాతి, దిగ్గజ కంపెనీలు, బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకొని వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి మహత్తర పథకాలతో సుస్థిరమైన ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన జగనన్న ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన పరిపాలన అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని సంస్కరణలు చేయడం ఖాయమని మంత్రి రోజా విశ్వాసం వ్యక్తం చేశారు

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కెడిసిసి బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, రైతు విభాగం జోనల్ ఇంఛార్జి కడవకొల్లు నరసింహారావు, అవనిగడ్డ సర్పంచ్ గొర్రుముచ్చు ఉమ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణతో పాటు డిఆర్ఓ ఎం. వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఆర్డిఓ ఐ. కిషోర్, డిఆర్ డి ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పిఎస్ఆర్ ప్రసాద్ స్థానిక ప్రజా ప్రతినిధులు, పలువురు స్వయం సహాయక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పట్టణాలకు ధీటుగా గ్రామాలుఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



వీరులపాడు ఆగస్టు 11 ప్రజా పాలన ప్రతినిధి మండ లంలోని "జుజ్జూరు" గ్రామంలో గడపగడపకు -మన ప్ర భుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ప థకాల బుక్ లెట్ లను శాసనసభ్యులు డాక్టర్ మొం డితోక జగన్ మోహన్ రావు ప్రజలకు అందజేశారు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తం గా 87 శాతం గృహాలకు సంక్షేమ పథకాల ద్వారా మంచి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అని తెలిపారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాలుగే ళ్ల లో రూ.రెండు లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్ర జలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించ డంతో పాటు గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జ గన్ మోహన్ రావు చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న ము ఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి ప్రజలు మద్ద తు పలికి ఆశీర్వదించాలని కోరారుఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వా లంటీర్లు, తదితరులు పాల్గొన్నారు

# నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

జగ్గయ్యపేట ఆగస్టు 11 ప్రజాపాలన ప్రతినిధి: పట్ట ణంలో 7వ వార్డు ఆర్టీసీ కాలనీలో భవిష్యత్తుకు గ్యా రెంటీ కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి శ్రీ రాంరాజగోపాల్ తాతయ్య పాల్గొని మాట్లాడుతూనా లుగున్నర ఏళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశన మైందని, అభివృద్ధి జరగాలంటే అది టిడిపి తోనే సా ధ్యమన్నారు. వచ్చే ఎన్నికలలో టిడిపిని అత్యధిక మె జారిటీతో గెలిపించాలని కోరారుఈ కార్యక్రమంలో మే క వెంకటేశ్వర్లు మైనేని రాధాకృష్ణ యామర్తి బోస్ యా దవ్, పేరం సైదేశ్వర రావు,గెల్లా వైకుంఠేశ్వరరావు, వే దులపురి సైదా, గడ్డం రాంబాబు, మొగిలి శ్రీనివాసరా వు, కొత్త నాగరాజు,అనిల్, షేక్ మౌలాలి, బద్రి, గోపి, బాలసైదా, నారాయణ, మీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు



# రైతు సంక్షేమమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వ చేయూత. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి

చీరాల, ఆగష్టు 11, ప్రజా పాలన : రైతు సంక్షేమమే లక్ష్యంగా, వైసిపి ప్రభుత్వం ఆర్.బి.కెల ద్వారా, చేయూతను అంది స్తుందని, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న చైర్మన్ రమణారెడ్డి

మండల వ్యవసాయ కార్యాల యంలో ఏవో సుమతి అధ్యక్షతన జరిగిన చీరాల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ముఖ్య అతిధిగా చైర్మన్ రమణారెడ్డి హాజరయ్యా రు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, పంటనమోదు, పి.ఎం. కిసాన్, ఇ కె వై సి ల పై సమీక్షించి, ఆయా పథకాల ప్రయోజనాల గురించి వివ రించి, ప్రతి ఆర్.బి.కె.లలో ముందుగా ఎరువులు నిల్వ చేసి ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డి.ఎ.పి,యూరియా,14-35-14, ఎరువులు ఉన్నా య న్నారు. రైతులకు సాగు నీటిని ఇప్పటికే అందుబాటులో ఉ ంచామని, నీటిపారుదలశాఖ అధికారులు తెలియజేశారు. సమావేశంలో చీరాల వ్యవసా య సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి తో పాటు, ఏ.ఓ. సుమతి, నీటిపారుదల ఏ.ఇ. సంధ్య, సత్యనారాయ ణ, బోర్డు సభ్యులు గవిని యానాది రావు, గండూరి వెంకట్రావు, నల్లబోతుల రేఖ తేళ్ల మోషే, ఆర్ బి కె వి.ఎ.ఎ. లు పాల్గొన్నారు.

# గొర్రెలు దొంగతనానికి పాల్పడిన దొంగలను పట్టుకున్న పోలీసులు



మడకశిర,ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని బుళ్ళసముద్రం గ్రామ సమీపంలో పొలంలో రాత్రిల్లో మందగా గొర్రెలను గొర్రెల కాపరులు ఉంచడంతో వారం రోజుల క్రితం ఆదివారం రాత్రి దొంగలు గొర్రెల కాపరులను బెదిరించి దాదాపు 30 గొర్రెలను బొలేరో వాహనంలో ఎత్తుకెళ్లారు ,విషయం తెలుసుకున్న సిఐ సురేష్ బాబు ,ఎస్ఐ లోకేష్ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి రెండు టీమ్ లుగా పంపి ఐదు గంటలలోపు గొర్రెలను దొంగతనానికి పాల్పడిన దొంగలను పట్టుకొన్నారు.శుక్రవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ ,డి.ఎస్.పి ఆదేశాల మేరకు'స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ సురేష్ బాబు ' ఎస్. ఐ లోకేష్ లు ఆధ్వర్యంలో ఆ దొంగలను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పాత్రికేయుల సమావేశంలో వివరించారు . అనంతరం దొంగలు దొంగలించిన గొర్రెలను గొర్రెల కాపరి ఈరన్నకు అప్పగించారు .ఈ దొంగతనం కేసును అతి తక్కువ సమయంలో పట్టుకుని ఆ గొర్రెల కాపరికు న్యాయం చేసినందుకు సీఐ సురేష్ బాబు, ఎస్సై లోకేష్ లకు పోలీసు సిబ్బందికి ప్రజలు అభినందనలు తెలిపారు.

# ఎన్టీపీసీలో ఘోర ప్రమాదం.. ఇద్దరు కార్మికులు మృతి

అనకాపల్లి/ విశాఖపట్నం: అనకాపల్లిలోని పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలో ఘోర ప్రమాద ఘటన చోటుచేసుకుంది. ఎన్టీపీసీలో కేబుల్ ట్రాక్ విరిగిపడి ఇద్దరు కార్మికులు మృతి చెందారు.



ఈ ప్రమాంలో మరో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని ఆసుపత్రికి తరలించారు.

వివరాల ప్రకారం.. పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలో 50 అడుగుల ఎత్తులో కేబుల్ ట్రాక్ నిర్మిస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కేబుల్ ట్రాక్ విరిగిపడటంతో ఇద్దరు కార్మికులు మృతిచెందగా మరో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో, గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

# చిరంజీవిపై వైసీపీ నేతల వ్యాఖ్యలు సరికాదు.



నరసాపురం, ఆగస్టు 11 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రముఖ సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి ఇటీవల ఒక సినిమా ఫంక్షనులో మాట్లాడుతూ సినీ పరిశ్రమను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్ళాలి కానీ టికెట్ రేట్లు తగ్గించిన పరిశ్రమకు ఇబ్బంది కలిగించకూడదంటూ చేసిన వ్యాఖ్యలకు వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రెస్ మీట్లు పెట్టి చిరంజీవికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను జనసేన పార్టీ రాష్ట్ర పిఏసి సభ్యుడు, నరసాపురం నియోజకవర్గ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం సినీ పరిశ్రమను ఆదుకోవాలని అడుగుతుంటే వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు చిరంజీవిని రాజకీయాల్లోకి లాగి అభ్యంతరకరంగా మాట్లాడడం సమంజసం కాదని ఆయన అన్నారు. చిరంజీవి కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి ఎన్నో అభివృద్ధి పనులకు ఆయన నిధులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అప్పులు తప్ప ఇంకేమిలేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చిరంజీవి మాట్లాడితే దానికి స్పందించకుండా వ్యక్తిగతంగా దూషించడం సమంజసం కాదని వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులపై నాయకర్ మండిపడ్డారు.

# చంద్రబాబు ఓ ముసలి నక్క.. పవన్‌పై కారుమూరి సీరియస్

విజయవాడ: టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్ బాబు, పవన్ కల్యాణ్‌పై మంత్రి కారుమూరి నాగేశ్వర రావు సీరియస్ అయ్యారు. చంద్రబాబు ఓ ముసలి నక్క, దుర్మార్గుడు, పుంగనూరులో రౌడీలా వ్యవహరించారని ఆరోపించారు.

లోకేశ్ పప్పు.. అతనొక రాజకీయ నాయకుడేనా? అని ప్రశ్నించారు.




పవన్ తాటతీస్తా.. పంచలూడదీస్తా అంటున్నాడు.. ఇది కరెక్టేనా? అని అన్నారు.

సినిమాలకు రాజకీయాలను జోడించడమేంటి..

కాగా, మంత్రి కారుమూరి గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పుంగనూరులో పోలీసులకు చేతులెత్తి దండం పెట్టాలి. రక్తమోడుతున్నా తుపాకులకు పనిచెప్పకుండా సంయమనం పాటించారు. చంద్రబాబు ఇంకెంతమంది ఉసురు పోసుకుంటారని విమర్శించారు. ఏపీలో శాంతి భద్రతలు లేవని చూపించడానికే చంద్రబాబు ప్రయత్నిస్తున్నాడు. పవన్ తాటతీస్తా.. పంచలూడదీస్తా అంటున్నాడు.. ఇది కరెక్టేనా? అని అన్నారు. మనస్థాయి ఏంటి.. మన బ్రతుకేంటి అని ఆలోచించుకోవాలి. సినిమాను సినిమాగా.. రాజకీయాలను రాజకీయాలుగా చూడాలి. అంతేకానీ సినిమాకు, రాజకీయాలను జోడించి చూడటం సరికాదు.

ప్రజల వద్దకు వెళ్లి ఏం చెబుతారు..

మమ్మల్ని విమర్శించే ఏ పార్టీ నాయకులకైనా ప్రజల వద్దకు వెళ్లే దమ్ముందా? అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన, బీజేపీలో నేతలు తప్ప ఏ ఒక్క కార్యకర్త అయినా మాట్లాడుతున్నాడా?. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని పార్టీల వారికీ పథకాలు అందుతున్నాయి. అందుకే నాయకులు తప్ప ఆ పార్టీల కార్యకర్తలెవరూ మమ్మల్ని విమర్శించడం లేదు. వీరంతా ఏం చేశారని ప్రజల వద్దకు వెళ్లి మాట్లాడతారు. సర్వేలన్నీ మాకు అనుకూలంగా ఉన్నాయి. వాళ్లు అధికారంలోకి వస్తే ఏం చేస్తారో చెప్పలేకపోతున్నారు. టీడీపీ కార్యకర్తల ఉసురు, ప్రజల ఉసురు కచ్చితంగా చంద్రబాబుకు తగులుతుంది. ఈ రాష్ట్రాన్ని దోచుకోవడానికే అందరినీ కలుపుకుని అధికారంలోకి రావాలని చూస్తున్నాడంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# రైల్వే ట్రాక్‌పై ఆగిన కారు

విశాఖపట్నం:మారుతీ జంక్షన్ వద్ద గల రైల్వే క్రాసింగ్ దాటుతున్న సమయంలో ట్రాక్‌పై కారు నిలిచిపోయింది. మారుతీ జంక్షన్ మీదుగా శ్రావణ్ షిప్పింగ్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొట్టడంతో..

కారు ఎగిరి పక్కన పడింది. లోకో పైలట్ సమయస్ఫూర్తితో నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. గూడ్స్ రైలు విశాఖ పోర్టు ట్రస్ట్ నుంచి మారుతీ జంక్షన్ మీదుగా శ్రావణ్ షిప్పింగ్ గొడౌన్ల వైపు వెళ్తోంది.

అదే సమయంలో ములసాగ హౌసింగ్ కాలనీ నుంచి నగరం వైపు ఓ కారు రైల్వే క్రాసింగ్ దాటుతోంది. ఆకస్మాత్తుగా కారు ట్రాక్‌పై నిలిచిపోవడంతో అటుగా వస్తున్న గూడ్స్ రైలు కారును ఢీ కొట్టింది. దీంతో కారు ఎగిరి రోడ్డుపై పడటంతో అందులో ఉన్న ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులకు స్వల్ప గాయాలయ్యాయి.

ట్రాక్‌పై కారును గమనించిన లోకో పైలట్.. శాయశక్తులా వేగం తగ్గించడంతో పాటు కేబిన్ బయటకొచ్చి గట్టిగా అరిచినట్లు స్థానికులు తెలిపారు.

# చదువుకున్న పాఠశాలకు పోడియం బహుకరణ... శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ...

గోకవరం ఆగస్టు 11 ప్రజా పాలన చిన్ననాటి స్నేహితులతో కలిసి చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలి అన్న ఉద్దేశంతో అందర్నీ తీర్చిదిద్దిన పాఠశాలకు పోడియం ను బహుకరించిన శివ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు.

ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. 1989 1990లో స్నేహితులతో కలిసి పదవ తరగతి చదువు కోవడం జరిగిందని

గుర్తు చేశారు 30 సంవత్సరాల తర్వాత అందరూ కలిసి గెట్ టుగెదర్ పాఠశాలలో నిర్వహించడం జరిగిందని తెలిపారు చదివిన పాఠశాలకు ఏదైనా మంచి చెయ్యాలి అన్న ఉద్దేశంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు పోడియం ను బహూకరించామని తెలిపారు శివ వెల్ఫేర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలునిర్వహిస్తున్నామని తెలిపారు స్నేహితులతో చదివిన పాఠశాలకు బహుమతి అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు




ఈసందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు వి ఎన్ రెడ్డి మాట్లాడుతూ. శివ వెల్ఫేర్ అసోసియేషన్ వారు

తన చిన్ననాటిస్నేహితుడి కోసం ఒక సంస్థగా ఏర్పడి చదువుకున్న పాఠశాలకు మంచి చేయాలి అని

పాఠశాలకు పోడియం ను బహూకరించడం జరిగిందని తెలిపారు మంచి సంకల్పంతో వీరు గ్రామంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు శివ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సుమారు 150 మంది సభ్యులతో కూడిన బృందం ఈ సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారని చెప్పారు.. ఈ కార్యక్రమంలో . వాకచర్ల రవి. మారిశెట్టి నాగేశ్వరరావు, వచ్చిపులుసు, రాఘవేంద్రరావు. మహిపాలా సతీష్. బత్తుల రాయుడు. నాగులకొండ వీరభద్రం.అద్దంకి వెంకటేశ్వరరావు రావోజీ దుర్గ తదితరులు పాల్గొన్నారు..

# డా. వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రాధికారెడ్డికి పిడిఎస్ యు వినతి

విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వైద్యవిద్యను అంగడిలో సరుకుగా మార్చి, వ్యాపారమయం చేయడానికి తీసుకువచ్చిన 107,108 జీవోలను తక్షణమే రద్దు చేయాలని పిడిఎస్ యు రాష్ట్ర ప్రతినిధుల బృందం విజయవాడలో శుక్రవారం మధ్యాహ్నం డా. వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రాధికారెడ్డికి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యూ. గనిరాజు, ఎల్. రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023-24 విద్యా సంవత్సరం నుండి విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో ఐదు మెడికల్ కాలేజీలను ప్రారంభించిందని అన్నారు. అయితే ఈ మెడికల్ కాలేజీల్లో



సీట్లను ఏ కేటగిరి కన్వీనర్ కోటా-50శాతం , బి కేటగిరి సెల్ఫ్ ఫైనాన్సింగ్ -35 శాతం, సి కేటగిరి ఎన్. ఆర్.ఐ కోటా 15 శాతం మూడు కేటగిరిలుగా వర్గీకరించి ఫీజులను వరుసగా 15వేలు, 12 లక్షలు, 20 లక్షలు రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయిస్తూ 107,108 జీవోలను జారీ చేసిందని అన్నారు. ప్రభుత్వ వైద్య కాలేజీల్లో ఇప్పటి వరకూ 100 శాతం సీట్లను కన్వీనర్ కోటా క్రిందనే భర్తీ చేసే వారని, నేడు బి, సి కేటగిరీలుగా మార్చి వైద్య విద్యను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు దూరం చేస్తుందని అన్నారు. అంతేకాకుండా మెరిట్ విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. వైద్య కళాశాలల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తుందని, జాతీయ వైద్య మండలి అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం బి, సి కేటగిరిలుగా చేసి ఫీజులు ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించారు. పేద బడుగు విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసే 107,108 జీవోలను తక్షణమే రద్దు చేయాలని, అలాగే పీజీ మెడికల్ మరియు డెంటల్ కాలేజీల్లో పెంచిన 15 శాతం ఫీజులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జగన్ ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పి పాఠశాల విద్యను ధ్వంసం చేసిందని, పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యకు ఫీజు రియంబర్స్ మెంట్ ను 77 జీవో తెచ్చి గత మూడు సంవత్సరాల నుండి వేలాది మంది పేద విద్యార్థులు పీజీ విద్యకు దూరం చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేఖ విధానాలను త్రిప్పి కొట్టాలని విద్యార్థులకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సునీల్, నాయకులు వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు పిపిఎ కిట్లను ఇవ్వాలి-సామకోటి ఆదినారాయణ

పుట్టపర్తి ,ప్రజాపాలన ప్రతినిధి : శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మున్సిపాలిటీ పుట్టపర్తి పరిధిలో పెద్ద కమ్మవారి పల్లికి వెళ్లే రహదారి మార్గాన పారిశుద్ధ్య కార్మికులకు సరైన వసతులు కల్పించకపోవడం వలన పరిసరాలను శుభ్రం చేయలేని పరిస్థితి ఉంది . శుక్రవారం నాడు స్థానికంగా పెద్ద కమ్మవారి పల్లి కి వెళ్లే రహదారి దగ్గర కుప్పలు కుప్పలుగా ఉన్నటువంటి చెత్తను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పిపిఎ కిట్లను ప్రతి కార్మికులకు అందివ్వాలని అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల్ని కరోనా విపత్తు,కష్టకాలంలో కోవిడ్ వారియర్స్ గా ఫ్రంట్ లైన్ వారియర్స్ గా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించారని అప్పుడేమో ప్రజా నాయకులు పొగడ్తలతో ముంచేత్తేశారని, ఇప్పుడేమో నేటి



నుండి పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్అలవెన్స్ మున్సిపల్ కార్మికులకు ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు .పారిశుద్ధ్య పనులు నగరంలో పనిచేస్తూ పని భారంతో కార్మికులందరూ మగ్గుతూ,అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ పనిచేస్తున్నారని వీరందరికీ ఈ.పీ.ఎఫ్ ఈ.ఎస్.ఐ సక్రమంగా అమలు కాని పరిస్థితిలో కూడా కార్మికులు పని చేస్తూ ఉంటే వారికి కనీసం ఇప్పుడైనా రిస్క్ హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, ఈ పారిశుద్ధ్యం వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల దోమలు తీవ్రం కావడంతో అటు కార్మికులు,ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు .దోమలు కుట్టిన అనేకమందికి టైఫాయిడ్,మలేరియా జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి కనీసం పారిశుద్ధ్య కార్మికులకు తగినంత వంటి పిపిఏ కిట్లు ద్వారా హ్యాండ్ బ్లౌజు షూ అవసరమైనటువంటి పరికరాలు వాళ్ళకి అందుబాటులోకి తీసుకురావాలని లేకపోతే వారికి అనారోగ్య కారణాలవల్ల బారిన పడే అవకాశాలు ఉన్నాయని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# అతీంద్రియ శక్తులు కలిగిన ఓ యువతి కథే 'చిరో'



ప్రముఖ నిర్మాత ఎంఎస్ మంజూర్ రెండవ చిత్రానికి సిద్ధం అవుతున్నారు. విభిన్న కథా చిత్రాలను నిర్మించాలన్న ఆసక్తితో ఈయన ప్రస్తుతం మిలియన్ స్టూడియోస్ పతాకంపై సత్యరాజ్ కథానాయకుడిగా వెపన్ అనే వైవిధ్య భరితమైన కథా చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం నిర్మాణ దశలోనే పరిశ్రమ వర్గాల్లో మంచి అటెన్షన్‌కు గురిచేస్తోంది. చిత్రాన్ని సెప్టెంబర్‌లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ చిత్ర నిర్మాత తదుపరి నిర్మిస్తున్న మరో చిత్రం చిరో. ఇంతకు ముందు పలు యాడ్ ఫిలిమ్స్ చేసిన వివేక్ రాజారామ్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు.

ఈ చిత్రం గురించి ఆయన మాట్లాడుతూ.. ఇది ఫాంటసీ నేపథ్యంలో సాగే వైవిధ్య భరిత కథా చిత్రంగా ఉంటుందన్నారు. ఈ చిత్ర కథలు చెప్పగానే నిర్మాతలు మంజూర్, అబ్దుల్ చాలా ఇంప్రెస్స్ అయ్యారన్నారు. ఇది ఒక్క జానర్లో సాగే కథాచిత్రంగా ఉండదని.. ప్రతి 20, 25 నిమిషాలకు జానర్ మారుతుందని ఆయన చెప్పారు.

అతీంద్రియ శక్తులు కలిగిన యువతి కథే

అతీంద్రియ శక్తులు కలిగిన ఓ యువతి ఇతివృత్తమే ఈ చిత్రం అన్నారు. ఇందులో కథానాయకిగా ప్రార్థనా చాబ్రియ నటించనున్నారని చెప్పారు. ఈమెది ఫాంటసీతో కూడిన ఫిక్షన్ కథా పాత్రగా ఉంటుందన్నారు. నటి ప్రార్థనా చాబ్రియను కలిసినప్పుడు ఆమె మాత్రమే ఈ పాత్రను చేయగలరని భావించారన్నారు. చిత్ర షూటింగ్‌ను సెప్టెంబర్ రెండో వారం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కిషన్ సీవీ ఛాయాగ్రహణం అందించనున్న ఈ చిత్రం పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు దర్శకుడు వెల్లడించారు.

# రెండోసారి ప్రెగ్నెంట్ అయ్యా.. ఆ ఆనందం ఎంతోకాలం ఉండలేదు.. హీరోయిన్ ఎమోషనల్




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రాణీ ముఖర్జీ తన జీవితంలోని చేదు అనుభవాన్ని పంచుకుంది. కోవిడ్ సమయంలో కడుపులో బిడ్డను పోగొట్టుకున్నానని వెల్లడించింది.

మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిలిం ఫెస్టివల్ కార్యక్రమంలో ఆమె ఈ విషాదవార్తను బయటపెట్టింది. ఆమె మాట్లాడుతూ.. 'ఈ విషయాన్ని బయటకు చెప్పడం ఇదే మొదటిసారి. ఈ రోజుల్లో జీవితంలోని ప్రతి విషయాన్ని పబ్లిక్‌గా చెప్తుంటే సినిమా ప్రమోషన్స్‌కోసమేనని విమర్శలు చేస్తున్నారు. అందుకే నా సినిమా ప్రమోషన్స్ చేసేటప్పుడు నా వ్యక్తిగత విషయాల గురించి నేనెక్కువగా మాట్లాడను.

కోవిడ్‌తో ప్రపంచమే అల్లకల్లోలం అవుతున్నప్పుడు నా జీవితంలో కూడా పెను విషాదం చోటు చేసుకుంది. 2020లో నేను రెండోసారి ప్రెగ్నెంట్ అయ్యాను. దురదృష్టవశాత్తూ ఐదు నెలలకే బిడ్డను కోల్పోయాను. 2020 చివర్లో ఈ సంఘటన జరిగింది. ఈ విషయం ఎవరికీ తెలియదు. నా బిడ్డను కోల్పోయిన 10 రోజులకే నిర్మాత నిఖిల్ అద్వానీ నాకు ఫోన్ చేశాడు. డైరెక్టర్ చెప్పిన కథను నాకు వినిపించాడు. నాకు ఎలా స్పందించాలో అర్థం కాలేదు.

కానీ ఏదైనా తీవ్రమైన బాధలో ఉన్నప్పుడే దాని నుంచి బయటవేసేందుకు ఇలాంటి మంచి సినిమా ఆఫర్ వస్తుందేమో అనిపించింది. మొదట మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే కథ వినప్పుడు అంత నమ్మకం కుదరలేదు. నార్వేలాంటి దేశంలో ఒక భారతీయ కుటుంబం ఇన్ని ఇబ్బందులు పడుతుందా? అనిపించింది' అని చెప్పుకొచ్చింది. కాగా మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే చిత్రం అనురూప్, సాగరిక భట్టాచార్య దంపుతల నిజ జీవిత కథ ఆధారంగా తెరకెక్కింది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

# 'పోర్ తొళిల్' మూవీ రివ్యూ




థ్రిల్లర్ సినిమాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. కరెక్ట్‌గా తీయాలే గానీ అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంటుంది. అలా కొన్నాళ్ల ముందు తమిళంలో విడుదలైన 'పోర్ తొళిల్' సినిమా అక్కడ సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు ఓటీటీలో వచ్చేసింది. సోనీ లివ్‌లో తెలుగులోనూ అందుబాటులో ఉంది. మర్డర్ మిస్టరీ స్టోరీకి తోడు సస్పెన్స్, థ్రిల్ ఎలిమెంట్స్‌తో తీసిన ఈ సినిమా ఎలా ఉంది? ఏంటనేది రివ్యూలో చూద్దాం.

కథేంటి?

క్రైమ్ బ్రాంచ్‌లో ఎస్పీ లోకనాథన్ (శరత్ కుమార్) స్ట్రిక్ట్ ఆఫీసర్. ఇతడి దగ్గర డీఎస్పీ ట్రైనీగా పనిచేసేందుకు ప్రకాశ్(అశోక్ సెల్వన్) వస్తాడు. టెక్నికల్ అసిస్టెంట్ వీణ(నిఖిలా విమల్) కూడా ఉంటుంది. తిరుచ్చిలో జరిగిన ఓ మర్డర్ కేసు విచారణ బాధ్యత ఈ ముగ్గురికి అప్పగిస్తారు. దీన?్ని దర్యాప్తు చేస్తున్న క్రమంలో వరుస హత్యలు జరుగుతుంటాయి. చివరకు లోకనాథన్, ప్రకాశ్, వీణ... హంతకుడిని పట్టుకున్నారా? వాళ్లకు ఎదురైన పరిస్థితులు ఏంటి? చివరకు ఏం జరిగిందనేదే 'పోర్ తొళిల్' స్టోరీ.

ఎలా ఉందంటే?

థ్రిల్లర్ సినిమా ఏదైనా సరే దాదాపుగా రెండే అంశాలు ఉంటాయి. ఎవరు చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు? వీటిలో ఏదో ఓ పాయింట్ ఆధారంగానే దాదాపు అన్ని మూవీస్ తీస్తుంటారు. 'పోర్ తొళిల్'కి కూడా అదే ఫార్ములా ఉపయోగించారు. అయితే మిగతా వాటికి దీనికి తేడా ఏంటంటే థ్రిల్. మూవీ చూస్తున్నంతసేపు మనకు అన్నీ తెలుసని అనుకుంటాం. కానీ ఏదో ఓ కొత్త ట్విస్ట్ మనల్ని ఆశ్చర్యపరుస్తూ ఉంటుంది. ఈ సినిమాలో మ్యాజిక్ అదే.

ఫస్టాఫ్ విషయానికొస్తే.. రాత్రిపూట గస్తీ కాస్తున్న పోలీసులకు ఓ చోట యువతి శవం కనిపిస్తుంది. అలా ఫస్ట్ సీన్‌తోనే దర్శకుడు నేరుగా పాయింట్?లోకి తీసుకెళ్లిపోయాడు. అనంతరం ఎస్పీ లోకనాథన్, ట్రైనీ డీఎస్పీ ప్రకాశ్ పాత్రల పరిచయం. మనస్తత్వాలు డిఫరెంట్‌గా ఉండే ఈ ఇద్దరు కలిసి, ఓ మర్డర్ కేసు దర్యాప్తు చేయడం, ఈ క్రమంలోనే వీళ్లకు ఆధారాలు ఒక్కొక్కటిగా దొరకడం.. ఇలా స్టోరీ చకచకా పరుగెడుతూ ఉంటుంది. ఇంటర్వెల్ వరకు ఓ టెంపోలో సాగిన సినిమా.. సెకండాఫ్‌లో మాత్రం మంచి ట్విస్టులతో మరో రేంజుకి వెళ్లింది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌ని మంచి థ్రిల్ ఇచ్చే సీన్స్‌తో ఎండ్ చేయడం బాగుంది.

ఓవైపు లోకనాథన్, ప్రకాశ్... మర్డర్ కేసు దర్యాప్తు చేస్తుండగానే వరుస హత్యలు జరుగుతుంటాయి. ఇక్కడ డైరెక్టర్ రాసుకున్న సీన్స్ అన్నీ కూడా సాధారణ ప్రేక్షకుడికి క్లియర్‌గా అర్థమయ్యేలా ఉంటాయి. ఫీల్డ్ ట్రైనింగ్, హత్య ఎలా జరిగిందో వివరించడం లాంటి సన్నివేశాలు చూస్తుంటే మనం అక్కడే ఉన్నామనే ఫీలింగ్ కలుగుతుంది. అదే సమయంలో ప్రకాశ్ అమాయకత్వంతో సింపుల్ కామెడీ మనల్ని నవ్విస్తుంది. సీన్స్ అన్నింటికీ క్లైమాక్స్‌కి లింక్ చేసిన విధానం బాగుంది. ఇదేదో క్రైమ్ థ్రిల్లర్ అని కాకుండా చివర్లో ఓ సందేశం ఇచ్చారు. అయితే అది చూసిన తర్వాత నిజంగానే మనుషులు ఆ ఒక్క విషయం వల్ల సైకో కిల్లర్స్‌లా మారతారా అనే డౌట్ వస్తుంది.

ఎవరెలా చేశారు?

ఈ సినిమాలో కనిపించే పాత్రలు చాలా తక్కువ. కాకపోతే ప్రతి ఒక్కరినీ దర్శకుడు బాగా వాడుకున్నాడు. ఎస్పీ లోకనాథన్‌గా శరత్ కుమార్, ట్రైనీ డీఎస్పీ ప్రకాశ్‌గా అశోక్ సెల?్వన్ సెటిల్డ్ ఫెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ప్రకాశ్ పాత్ర మొదట భయస్తుడిగా కనిపిస్తుంది. క్లైమాక్స్ వచ్చేసరికి మారిపోతుంది. వీణగా నిఖిల్ విమల్ బాగానే చేసింది. ఈ పాత్రకు పెద్దగా స్కోప్ లేదనుకుంటాం. కానీ మూవీ చివరకొచ్చేసరికి ఈమె పాత్రకు ఉన్న ప్రాధాన్యం అర్థమవుతుంది. కెన్నడీగా శరత్‌బాబు రోల్ అస్సలు ఊహించని విధంగా ఉంటుంది. మిగతా పాత్రలు చేసిన యాక్టర్స్ పర్వాలేదనిపించారు.

'పోర్ తొళిల్' సినిమా టెక్నికల్‌గా అద్భుతంగా ఉంది. రైటింగ్, సినిమాటోగ్రఫీ, మ్యూజిక్.. ఇలా ప్రతిఒక్కరూ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. రైటర్ ఆల్ఫ్రెడ్ ప్రకాశ్, దర్శకుడు విఘ్నేశ్ రాజాతో కలిసి మంచి థ్రిల్లర్‌ని ప్రేక్షకులకు అందించారు. హీరోహీరోయిన్లు ఉన్నారు కదా అని లవ్ ట్రాక్ లాంటి వాటి జోలికి పోకుండా దర్శకుడు మంచి పనిచేశాడు. క్లైమాక్స్‌లో సీక్వెల్ ఉంటుందనే హింట్ ఇచ్చారు. ఓవరాల్‌గా చెప్పుకుంటే ఈ వీకెండ్ ఏదైనా మంచి సినిమా చూద్దామనుకుంటే 'పోర్ తొళిల్' బెస్ట్ ఆప్షన్.

టైటిల్: పోర్ తొళిల్

నటీనటులు: శరత్ కుమార్, అశోక్ సెల్వన్, నిఖిలా విమల్, శరత్‌బాబు తదితరులు

నిర్మాతలు: సమీర్ నాయర్, దీపక్ సెహగల్, ముఖేష్ మెహతా, సీవీ శరత్, పూనమ్ మెహ్రా, సందీప్ మెహ్రా

దర్శకుడు: విఘ్నేశ్ రాజా

సంగీతం: జేక్స్ బెజోయ్

ఎడిటర్: శ్రీజిత్ సరంగ్

సినిమాటోగ్రఫీ: కాలైసెల్వన్ శివాజీ

విడుదల తేది: 2023 ఆగస్టు 11 (సోనీ లివ్)

# వరలక్ష్మి వెంటబడుతున్న తెలుగు డైరెక్టర్



తెలుగు సినీ పరిశ్రమలో పవర్‌ఫుల్ లేడీ విలన్ అనగానే అందరికీ గుర్తుకు వచ్చే పేరు 'రమ్యకృష్ణ'. నరసింహా, నీలాంబరి చిత్రాల్లో హీరోకు సమానంగా ఆమె నటించిన తీరు అందరినీ మెప్పిస్తుంది.

ఇప్పుడు జనరేషన్ మారింది. ఇప్పుడా ప్లేస్‌లోకి వరలక్ష్మి శరత్‌కుమార్ వచ్చేసిందని చాలామంది నెటిజన్లు కూడా కామెంట్లు చేస్తుంటారు. అంతలా ఆమె తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తుంది.

వరలక్ష్మికి తెలుగులో స్టార్ ఇమేజ్ అందించిన చిత్రం 'క్రాక్' . గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రవితేజ హీరోగా నటించిన ఈ చిత్రంలో జయమ్మగా ఆమెకు

# అడిగినా సాయం చేయలేదు.. సింధు మరణం తర్వాత కన్నీరు తెప్పించే ఘటన తెరపైకి




కోలీవుడ్‌లో కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో నటి సింధు మరణించింది. ఈ ఘటన అక్కడి పరిశ్రమలో పెద్ద చర్చనీయాంశమైంది. గత కొన్నేళ్లుగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ..

వైద్య ఖర్చులకు డబ్బులేక, అంత పెద్ద ఇండస్ట్రీ నుంచి సాయం అందక దీన స్థితిలో ప్రాణాలు వదిలేసింది. ఈ వార్త తమిళనాట చాలా మందిని కలిచివేసింది.

గతంలో సాయం కోసం ఆమె బహిరంగంగానే చేయి చాచింది. అందుకు సంబంధించిన వీడియోలను పలువురు నెటిజన్లు ఇప్పుడు షేర్ చేస్తున్నారు. 2020లోనే మీడియా ముందు సింధు కన్నీరు పెట్టుకుంటూ ఇలా మాట్లాడింది. ' నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. చికిత్స చేస్తే జబ్బు నుంచి కోలుకుంటానని వైద్యులు తెలిపారు. కానీ అందుకు అవసరమైన డబ్బు లేదు. ఇప్పటికే నా భర్త మరణంతో కుటుంబం కష్టాల్లో ఉంది. అనారోగ్యంతో నేను కూడా చనిపోతే నా కుమార్తె అనాథ అవుతుంది. ఇండస్ట్రీలోని పెద్దలు ఎవరైన సాయం చేయాలి' అని ఆమె కోరింది.

గతంలో ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సింధు మరణం తర్వాత వైరల్ అవుతున్నాయి. సింధు లాంటి మంచి మనసున్న మహిళ ఇన్ని కష్టాలు పడాల్సి వచ్చిందంటూ నటి షకీలా కూడా తెలిపింది. కోవిడ్ వ్యాప్తి సమయంలో చాలామంది జీవితాలు అస్తవ్యస్తమై తినేందుకు అన్నం కూడా లేకుండా పలువురు రోడ్డున పడ్డారు. అలాంటి వారికి ఆహారం అందించడానికి సింధు చొరవ తీసుకుందని షకీలా గుర్తుచేసింది. కోవిడ్ సమయంలో ధాతల నుంచి సేకరించిన వాటితో ఎంతోమందికి సాయం చేసింది. ఇలా ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిన సింధు చాలా కష్టాలు పడాల్సి వచ్చిందని, దేవుడు ఉన్నాడా..? అనే అనుమానం కూడా కలుగుతోందని షకీలా చెప్పింది.

సింధు మరణం తర్వాత తన స్నేహితులు మీడియా ముందు చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి.

మాస్టర్ కీ టీవీ ఛానల్
మీడియాలో స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి ఆహ్వానం
మీ వార్తకు మీరే యజమాని..!
ప్రస్తుతం తెలుగు రాష్టాలలో ఉన్న టీవీ ఛానెల్స్ అన్నీ.. మూడు పొలిటికల్ పార్టీలుగా విడిపోయి వారు ఆయా పార్టీలకు అనుకూలమైన వార్తలను ప్రసారం చేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవటం లేదు.
ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరి మనోభావాలను, సమస్యలను ప్రతీ రోజు మీరు పంపిన యెడల వాటిని మా ఛానెల్ ద్వారా ప్రసారం చేయబోతున్నాం.
ప్రతి పౌరుడికి మీడియా ద్వారా ఎంపవర్ చేయడమే మా ధ్యేయం. ఈ సాధికారత వల్ల ప్రజలు తమ సమస్యల పట్ల చైతన్యం కలిగి సమాజ శ్రేయస్సుకు చేయూతనివ్వగలుగుతారు.
ఇందుకు మీకు కలిగే లాభాలు :
1. సొంత సమస్యలు గాని, ప్రజా సమస్యలు గాని పరిష్కారం అయ్యే మార్గాలు.
2. నాయకునిగా ఎదిగే అవకాశం
3. మీ ద్వారా వచ్చే ప్రకటనలపై 50 - డిస్కౌంట్.
4. మీ పెట్టుబడి ఎక్కువ రేట్లు అయ్యే అవకాశం.
ఇందుకు మీరు చేయవలసిందల్లా వాటాదారునిగా చేరటమే.
మీరు మీ కుటుంబ సభ్యులందరూ కలిపి స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి రూ. 2 లక్షలు అంతకు మించిన విలువ చేసే వాటాలు తీసుకోవాలి.
మీకు కావాలంటే 2026 వ సంవత్సరం తర్వాత మీ వాటాలను మార్కెట్లో తిరిగి అమ్ముకునే అవకాశం ఉంటుంది.
ప్రస్తుతం కేబుల్ టీవీ ఛానెల్ గా ఉన్న మాస్టర్ కీ టీవీ త్వరలోనే శాటిలైట్ ఛానెల్ గా మారనుంది.
పతి ఒక్కరినీ భాగస్వామ్యులు కావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం.
రాజ్యాధికార సాధనకు MAMలో భాగమైన మీడియాను బలోపేతం చేద్దాం.
రండి..! కదలి రండి..!
వివరాలకై సంప్రదించండి...
91549 58315 - 76600 27683

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.